# భవిష్యత్ ప్రజాపాలన

మా వార్త రేపటి భవిష్యత్తుకు నిదర్శనం

bhavishyatprajapalana.in / epaper.bhavishyatprajapalana.in

తెలుగు దినపత్రిక

ASN NEWS

ఎడిటర్ : చిట్ల విజయ్‌కుమార్ రెడ్డి తెలంగాణ - రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 206 మంగళవారం , ఆగస్టు 25, 2026 , పేజీలు - 12 వెల : 1 /-


## తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది

**అమెరికా పర్యటనకు అనుమతిపై రేవంత్ తీవ్ర ఆగ్రహం**

**ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్య**

**విదేశాల్లో స్పందిస్తే దేశద్రోహి అనేవారని వెల్లడి**

**అమెరికాకు తెలంగాణ అధికారులను పంపినట్లు ప్రకటన**

**ఆక్స్‌ఫర్డ్‌తో తెలంగాణ ఒప్పందం చేసుకోనుందని వెల్లడి**




**హైదరాబాద్, ఆగస్టు 24 :**
అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. కేంద్రం తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. బ్రిటన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు.

మిగతా 2లో...




## స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**ఏలూరు జిల్లా ముసునూరులో కొత్త మొక్కజొన్న వంగడం ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి**



**ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసలు**

**రాష్ట్ర ప్రగతిని కాంక్షించే జాతీయవాది అంటూ కితాబు**

**రైతులే దేశానికి వెన్నెముక అని స్పష్టం చేసిన రాధాకృష్ణన్**

**ఒక రైతు విజయాన్ని ఉదాహరణగా చూపుతూ తన అనుభవాన్ని పంచుకున్న వైనం**

**ఏలూరు ఆగస్టు 24 :**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం అడ్డురాదని, ఇదే ఆయనలోని గొప్పతనమని ప్రశంసించారు మిగతా 2లో...

## కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం**




**హైదరాబాద్, ఆగస్టు 24 :**
తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి

మిగతా 2లో...

## లంచం వలలో రెవెన్యూ అధికారులు!

**విరాసత్ కోసం (పౌతి) రూ.14 వేలు డిమాండ్.. ఏసీబీకి చిక్కిన జీపీవో, ఆర్ఐ**

**ఆలేరు:** భూమి విరాసత్ ప్రక్రియలో సహకరించేందుకు రైతు నుంచి రూ.14 వేల లంచం తీసుకుంటూ ఆలేరు తహసీల్దార్ కార్యాలయానికి చెందిన జీపీవో షేక్ హమ్మద్, ఆర్ఐ వేముగంటి పూర్ణచందర్‌రావు ఏసీబీకి పట్టుబడ్డారు. సోమవారం జరిగిన ఈ ఘటన రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపింది. యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బుడిగే మహేష్‌కు కొలనుపాక రెవెన్యూ శివారులో కుటుంబానికి చెందిన 8.5 ఎకరాల భూమి ఉంది. ఇందులో 4.5 ఎకరాలు మహేష్‌కు, మరో 2 ఎకరాలను ఆయన అక్కకు తండ్రి బుడిగే ఉప్పలయ్య గతంలో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం తండ్రి మృతి చెందడంతో మిగిలిన భూమిని అక్కకు విరాసత్ చేయాలని మహేష్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. ఈ వ్యవహారంలో ఫీల్డ్ విచారణ చేయాల్సి ఉంటుందని అధికారులు చెప్పడంతో మహేష్ ఆర్ఐ పూర్ణచందర్‌రావును సంప్రదించాడు. జీపీవో హమ్మద్‌ను కలవాలని ఆర్ఐ సూచించినట్లు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. జీపీవో రూ.10 వేలు ఖర్చవుతుందని చెప్పగా, ఆర్ఐ మొత్తం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అంత మొత్తం ఇవ్వలేనని మహేష్ చెప్పడంతో చివరకు రూ.14 వేలకు ఒప్పందం కుదిరినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దీంతో మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు సోమవారం జీపీవో హమ్మద్‌కు రూ.14 వేల నగదు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం జీపీవోతో



పాటు ఆర్ఐను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. లంచం డిమాండ్‌పై ఫిర్యాదు..నగదు అందజేస్తుండగా పట్టివేత రెవెన్యూ కార్యాలయంలో భూ సంబంధిత పనులకు లంచం డిమాండ్ చేసిన వ్యవహారంపై ఏసీబీ అధికారులు దృష్టి సారించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పక్కా ప్రణాళికతో దాడి నిర్వహించి ఇద్దరు అధికారులను పట్టుకున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**ఏపీలో స్థానిక ఎన్నికలంటూ ప్రచారం.. ఎస్ఈసీ హెచ్చరిక**

**సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఫేక్ అని వెల్లడి**

**అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని ప్రజలకు ఎన్నికల సంఘం సూచన**

**100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభం**

**కొత్తగా 33.33 శాతం బీసీ రిజర్వేషన్ల ప్రతిపాదన**

**అమరావతి 24 :**
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ అంటూ సోషల్ మీడియా, వాట్సాప్‌లలో విస్తృతంగా ప్రచారమవుతున్న సమాచారం పూర్తిగా అవాస్తవమని, నకిలీదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. ఈ ఫేక్ షెడ్యూల్‌ను ప్రజలు నమ్మవద్దని, ఇతరులకు ఫార్వార్డ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే వారిపై కఠినమైన సైబర్ చట్టాల కింద చర్యలు తీసుకుంటామని మిగతా 2లో...






2లో.

## ఫీజు బకాయిల రగడ..

**హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష**

**రూ. 15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల విద్యార్థులకు నష్టమని ఆరోపణ**

**రాంచందర్ రావుది రాజకీయ డ్రామా అని కొట్టిపారేసిన మంత్రి పొన్నం**

## తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**జీవో 97ను వ్యతిరేకిస్తూ ఏబీవీపీ ఆందోళన**

**రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలేజీల బంద్‌కు పిలుపు**

**జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్**




**హైదరాబాద్, ఆగస్టు 24 :**
తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 97పై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నేడు (మంగళవారం) రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. పాలిటెక్నిక్ కళాశాలలను మిగతా 2లో...

## పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల దాహార్తి

**పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం**

**జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద సుమారు రూ. 280 కోట్ల కేటాయింపులు**

**‹96 శాతం ఓవరాల్ ప్రాజెక్టు పనులు.. 99 శాతం పైప్‌లైన్ నిర్మాణం పూర్తి**

**తుది అంకానికి నీటి శుద్ధి ప్లాంట్ పనులు**

**పులివెందుల పట్టణం, గ్రామీణం, సింహాద్రిపురం మండలాల్లో 100 శాతం పూర్తయిన పనులు**

**లింగాల మండల పరిధిలో 24 ఆవాసాలకు తాగునీటి సరఫరా**

2లో.



# స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

ఏలూరు జిల్లా ముసునూరులో జరిగిన నాన్-జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ చంద్రబాబు పాలనా దక్షతపై ప్రశంసల జల్లు కురిపించారు. ముసునూరు గ్రామాన్ని ఒక విజయగాథగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇది భారతీయ రైతుల పురోగతికి సంబంధించినదని ఉపరాష్ట్రపతి అన్నారు. తన ప్రసంగంలో ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. "రెండు నెలల క్రితం 'దినమలర్' అనే తమిళ పత్రికలో మొక్కజొన్న పరిశ్రమలో పారిశ్రామికవేత్త పట్టాభి రామారావు సాధించిన అసాధారణ విజయాల గురించి చదివాను. ఒకే ఒక్క వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. వెంటనే ఆయనకు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాను" అని వివరించారు. ఆ తర్వాత పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్‌ను బహుకరించారని గుర్తుచేసుకున్నారు.



ఈ ఘటన తర్వాత జరిగిన ఒక యాదృచ్ఛిక సంఘటనను ఉపరాష్ట్రపతి సభతో పంచుకున్నారు. కొద్దిరోజులకే ఉపరాష్ట్రపతి భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో పట్టాభి ఇచ్చిన పాప్‌కార్న్‌ను అందరికీ అందించానని తెలిపారు. ఒక భారతీయ రైతు వ్యవస్థాపక శక్తిని, ఆయన పండించిన ఉత్పత్తి సత్తాను చాటిచెప్పడానికే ఈ ఉదాహరణను చెబుతున్నానని రాధాకృష్ణన్ అన్నారు.

రైతులే ఈ దేశానికి వెన్నెముక అని ఆయన పునరుద్ఘాటించారు. జీడీపీ, అభివృద్ధి గురించి మనం మాట్లాడక ముందే తరతరాలుగా ఈ నాగరికతకు అన్నం పెట్టింది రైతేనని అన్నారు. "మన పండుగలు, పంచాంగాలు, కాలగమన భావన సైతం విత్తనం వేయడం నుంచి పంట కోయడం వరకు సాగిన వ్యవసాయ చక్రం ఆధారంగానే రూపుదిద్దుకున్నాయి. జనవరి 14న దేశమంతటా ఆంధ్రప్రదేశ్‌లో మకర సంక్రాంతి, పంజాబ్‌లో లోహ్రీ, తమిళనాడులో పొంగల్, అసోంలో బిహు అంటూ పంటల పండుగను జరుపుకుంటాం. ఇంతటి వైవిధ్యభరితమైన మన దేశాన్ని వ్యవసాయం ఏకం చేస్తోంది" అని ఆయన వివరించారు. ప్రస్తుత ధరల ప్రకారం దేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా దాదాపు ఐదో వంతు ఉందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్న్‌కా ఎండీ ఎస్పీబీ పట్టాభి రామారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కలిసి కొత్త వంగడాన్ని ఆవిష్కరించి, పలువురు రైతులను సత్కరించారు.

# శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి**

సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...తాను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించానన్నారు. తెలంగాణ ఎప్పటినుంచో 'గంగా- జమున తెహజీబ్'కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లిములు, క్రిష్టియన్లు మరియు ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాధమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో శాసనమండలి మైనారిటీల సంక్షేమ కమిటీ,షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సమావేశమయ్యింది. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ లు హాజరయ్యారు. మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్ కూడా హాజరయ్యారు. శాసనమండలి ఃూఅ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం , సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్యలు, శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు కూడా హాజరయ్యారు. ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో చైర్మన్, స్పీకర్, మరియు సెక్రటరీలు అభినందనలు తెలిపారు.

# పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల దాహార్తి

**అమరావతి ఆగస్టు 24 :**

జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళు_న్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.

ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ



చూపలేదు. చేపట్టిన పనుల్లో కడా నాణ్యత లేదు. కటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ కళ్యాణ్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది.

అప్పటి నుంచి పవన్ కళ్యాణ్ గారి ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కడా దాదాపు తుది దశకు చేరింది. కటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

# తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది

**మొదటిపేజీ తరువాయి**

టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా




అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**మొదటిపేజీ తరువాయి**

ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్ధిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

## ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా హెచ్చరించారు.

ఎన్నికల కమిషన్ అధికారిక చిహ్నాలు, లోగోలను దుర్వినియోగం చేసి కొందరు ఉద్దేశపూర్వకంగా ఈ నకిలీ షెడ్యూల్‌ను సృష్టించి ప్రచారం చేస్తున్నారని పునేతా తెలిపారు. ఈ షెడ్యూల్‌పై స్పష్టత కోరుతూ తమ కార్యాలయానికి అనేక ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా అధికారిక పత్రికా ప్రకటనల ద్వారా లేదా మీడియా సమావేశాల ద్వారా మాత్రమే వెల్లడిస్తామని, ప్రజలు అనధికారిక వార్తలను ఏమాత్రం పట్టించుకోవద్దని సూచించారు. ఖచ్చితమైన సమాచారం కోసం ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని కోరారు.

మరోవైపు, రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆగస్టు 19న జీవో జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 100 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉండటం వల్ల మరో 23 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. త్వరలోనే అధికారికంగా షెడ్యూల్ విడుదల చేస్తామని, అప్పటివరకు వదంతులను నమ్మవద్దని అధికారులు స్పష్టం చేశారు.

## తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**మొదటిపేజీ తరువాయి**

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, ఈ నిర్ణయం ద్వారా వాటిని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించింది.

ఈ నూతన విధానం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా రేపు చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులకు పిలుపునిచ్చింది.

# ఫీజు బకాయిల రగడ..

**హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష**

**హైదరాబాద్, ఆగస్టు 24** :ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం హైదరాబాద్‌లో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇదే విద్యార్థులు త్వరలో ప్రభుత్వాన్ని గద్దె దించుతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణకు వచ్చి బకాయిలు విడుదల కోసం చొరవ చూపాలని సవాల్ విసిరారు.

**రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ఈ డ్రామా: పొన్నం ప్రభాకర్**

రాంచందర్ రావు దీక్షపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే రాంచందర్ రావు ఈ తరహా డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. చేతనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం తమ ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు బ్యాంకుల ద్వారా అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అలాగే, సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలవుతోందా అని ఆయన ప్రశ్నించారు.

## ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు.. సాదిక్ ఖాన్‌కు రిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 24**



రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఘటన జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అతడిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు, సోమవారం కాకినాడకు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. సాదిక్ ఖాన్ వేధింపుల కారణంగానే నూకరాజు కుటుంబం బలవన్మరణానికి పాల్పడిందని కాకినాడ ఎస్పీ బిందుమాధవ్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.కేసు దర్యాప్తు వివరాలను ఎస్పీ వెల్లడిస్తూ.. రెండు ఆత్మహత్య లేఖలు ఈ కేసులో కీలక ఆధారాలుగా నిలిచాయని తెలిపారు. నూకరాజు రాసిన లేఖతో పాటు, ఆయన కుమార్తె సౌజన్య స్కూటీలో లభించిన మరో లేఖలోనూ సాదిక్ ఖాన్ పేరు స్పష్టంగా ఉందని చెప్పారు. అతని వేధింపులు భరించలేకే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారని, ఈ ఆధారాలతోనే దర్యాప్తును ముమ్మరం చేశామని వివరించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఇతర లేఖల గురించి తాము ఇప్పుడేమీ చెప్పలేమని, పక్కా ఆధారాలతోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు.

ఘటన అనంతరం సాదిక్ తన ఫోన్లను స్విచాఫ్ చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకునేందుకు 10 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి, ఐదు రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలించారు. చివరకు మీరట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ, ఐదుగురు సీఐలతో కూడిన బృందం సాదిక్‌ను విచారించింది. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో అతడిని కాకినాడ సబ్ జైలుకు తరలించారు.మరిన్ని వివరాలు రాబట్టేందుకు మంగళవారం కస్టడీ పిటిషన్ దాఖలు చేస్తామని, కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. సాదిక్ నిర్వహిస్తున్న షూటింగ్ అకాడమీపైనా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కీలక సూచన చేసిన ఎస్పీ.. వేధింపులు ఎదురైనప్పుడు ప్రాణాలు తీసుకునే బదులు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి, వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసులో నూకరాజు కుటుంబం ముందుగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆయన పేర్కొనడం గమనార్హం.

## వరుణదేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు ఏకమైన గ్రామాలు

# పాండవుల బండ వద్ద 30న వరద పాశం

- రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది

**సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్**





**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య:** దేవరకొండ వరుసగా కురుస్తున్న అకాల వర్షాలు, మరోవైపు సకాలంలో వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతుల కష్టాలు తీరాలని, రాబోయే సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఉమ్మడి మైనంపల్లి గ్రామాల ప్రజలు ఒక మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 30వ తేదీ ఆదివారం రోజున చారిత్రాత్మక పాండవుల బండ వద్ద వరద పాశం పోసే కార్యక్రమంతో పాటు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం మైనంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి మైనంపల్లి పరిధిలోని అంబటి వాని గూడెం, శక్కు తండా తదితర గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, రైతు సంఘం నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో సర్పంచ్ రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ... "మన పూర్వీకుల కాలం నుండి ఆచారంగా వస్తున్న వరద పాశం కార్యక్రమం ఎంతో మహిమాన్వితమైనది. రైతే రాజు, రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది. అందుకే కులమతాలకు అతీతంగా, అన్ని గ్రామాల రైతులు, యువకులు, పెద్దలు కలిసి ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనాలి. 30వ తేదీన జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబటి వాని గూడెం సర్పంచ్ హరికృష్ణ, శకృతండా సర్పంచ్ మోహన్ లాల్ మాట్లాడుతూ రైతుల ఐక్యతను చాటే ఈ కార్యక్రమానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. పాండవుల బండ దగ్గర జరిగే పూజలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సమావేశంలో అన్ని గ్రామాలకు చెందిన పెద్దమనుషులు, రైతులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు

## ఆటో కార్మిక సంఘాలతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు సఫలం

- ఆటో కార్మిక సంఘాల డిమాండ్స్ పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంది
- ఆటో కార్మిక సంఘాల నిరవధిక బంద్ విరమించుకోవాలన్న ప్రభుత్వ విజ్ఞప్తి కి స్పందించి సమ్మె విరమించిన ఆటో కార్మిక సంఘాలకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆటో కార్మిక సంఘాలకు ప్రభుత్వం నుండి సానుకూల అంశాలు



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజా పాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 24:** ఆర్టీసీ పక్షాన ఈవి ఆటో లు కొనే ప్రసక్తే లేదు



ఆది దుష్ప్రచారం మాత్రమే, ఆర్టీసీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించింది. విధివిధానాలకు సెప్టెంబర్ 1 వ తేదీ కార్మిక శాఖ & రవాణా శాఖ & ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం.. 2012 తర్వాత ఆటో చార్జీలు పెంచలేదు కాబట్టి ఆటో చార్జీలు పెంచడానికి అంగీకరిస్తూ ఎంత పెంచాలి అనే దానిపై తగిన నివేదిక తీసుకొని సంబంధిత జీవో విడుదల చేయడానికి అంగీకారం.. ఓలా, ఉబెర్ లా మాదిరి ప్రభుత్వం తరుపున యాప్ చేయాలని నిర్ణయం ప్రభుత్వం ఐటీ శాఖ నుండి యాప్ ప్రారంభించేందుకు తగిన ప్రక్రియ ప్రారంభిస్తాం.. ద్విచక్ర వాహనాల్లో రాపిడో,ఓలా ఉబెర్ నడిపే వాటికి ఎల్లో ప్లేట్ ఉన్న వాటికి మాత్రమే ప్రయాణికులను తరలింపు పై నిర్ణయం తీసుకుంటాం.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు 12 వేల రూపాయల అంశంపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తగిన అంశాలు పరిగణన లోకి తీసుకొని ముఖ్యమంత్రి ,ఉప ముఖ్యమంత్రి,సహచ మంత్రులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటాం.. హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో పాత డీజిల్, పెట్రోల్ ఆటోలకు రెట్రోఫిట్మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చడానికి 1.50 లక్షలు ప్రభుత్వం సహాయం అందిస్తుంది. కొత్త ఆటోలు కొనుగోలు చేయడానికి సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడానికి పర్యావరణాన్ని కాపాడడానికి నగరంలో ఈవి ఆటో లుగా మార్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.. ఆటో కార్మికుల సోదరులు వారి డిమాండ్స్ పట్ల ప్రభుత్వం పూర్తి సానుకూలంగా ఉంది.. ఆటో కార్మిక సంఘాలతో చర్చలు జరిపినా రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, వెంకట రమణ.

## సౌందర్య సంరక్షణ, వృత్తి శిక్షణకు అకాడమీ వేదికగా నిలవాలి





- త్వరలో బ్యూటీ అకాడమీ ప్రారంభం: మల్లారెడ్డి వర్సిటీ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతి రెడ్డి
- పటాన్‌చెరులో హెచ్‌ఆర్ లక్స్ స్టూడియో ప్రారంభం

**పటాన్‌చెరు, ఆగస్టు 24:** సౌందర్య సంరక్షణతో పాటు యువతకు వృత్తిపరమైన శిక్షణ అందించేలా త్వరలో ఏర్పాటు చేయనున్న బ్యూటీ అకాడమీ ఒక మంచి వేదికగా నిలవాలని మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతి రెడ్డి అన్నారు. పటాన్‌చెరులో మిసెస్ యూనివర్స్ ఇంటర్నేషనల్ గ్లోబల్ క్వీన్-2025 విజేత హేమలత రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌ఆర్ లక్స్ స్టూడియోను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రీతి రెడ్డి మాట్లాడుతూ.. హేమలత రెడ్డి బ్యూటీ, వెల్నెస్ రంగంలో ప్రత్యేక శిక్షణ పొందడంతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించుకుని హెచ్‌ఆర్ లక్స్ స్టూడియోను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్టూడియో ద్వారా మహిళలు, పురుషులకు హెయిర్ కేర్, స్కిన్ ట్రీట్మెంట్స్, నెయిల్ కేర్, ఫేషియల్స్ తదితర సేవలు అందిస్తున్నారని తెలిపారు. కస్టమర్ల వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రైవేట్ గదులు, వీఐపీ ట్రీట్మెంట్ సదుపాయాలు ఏర్పాటు చేయడం స్టూడియో ప్రత్యేకతగా పేర్కొన్నారు. వ్యక్తిగత గోప్యత, పరిశుభ్రత, సౌకర్యం, ప్రతి కస్టమర్‌పై ప్రత్యేక శ్రద్ధకు ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. హెచ్‌ఆర్ లక్స్ స్టూడియో కేవలం బ్యూటీ పార్లర్‌గా కాకుండా ప్రీమియం బ్యూటీ సేవలతో పాటు వృత్తిపరమైన విద్య, సృజనాత్మకత, కెరీర్ అవకాశాలను ఒకే వేదికపైకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకోవడం మంచి ఆలోచన అన్నారు. త్వరలో ప్రారంభించనున్న బ్యూటీ అకాడమీ ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రాక్టికల్ శిక్షణ అందించాలని సూచించారు.

**స్థానికంగానే ప్రీమియం సేవలు**

హెచ్‌ఆర్ లక్స్ స్టూడియో యజమాని హేమలత రెడ్డి మాట్లాడుతూ.. పటాన్‌చెరు, పరిసర ప్రాంతాల్లో ప్రీమియం బ్యూటీ, గ్రూమింగ్ సేవలకు అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ తరహా సేవల కోసం గతంలో హైటెక్ సిటీ, గచ్చిబౌలి, బంజారాహిల్స్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఈ అవసరాన్ని గుర్తించి పటాన్‌చెరులోనే ఆధునిక సదుపాయాలతో ప్రీమియం బ్యూటీ సేవలను అందించేందుకు స్టూడియోను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళలు, పురుషులకు ఫేషియల్స్, హెయిర్ కేర్, నెయిల్ కేర్, కాస్మోటాలజీ, అత్యాధునిక పీఎంయూ సేవలు, ఇతర ప్రత్యేక బ్యూటీ ట్రీట్మెంట్స్ అందిస్తున్నామని వివరించారు.

**త్వరలో బ్యూటీ అకాడమీ**

వర్ధమాన మేకప్ ఆర్టిస్టులు, బ్యూటీ ప్రొఫెషనల్స్‌కు పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాక్టికల్ శిక్షణ అందించేందుకు త్వరలో ప్రత్యేక బ్యూటీ అకాడమీని ప్రారంభించనున్నట్లు హేమలత రెడ్డి తెలిపారు. బ్యూటీ రంగంలో వృత్తిని ఎంచుకోవాలనుకునే వారికి అవసరమైన నైపుణ్యాలు, ఆధునిక పద్ధతులపై శిక్షణ అందించడమే అకాడమీ లక్ష్యమన్నారు. ప్రొఫెషనల్ బ్యూటీ విద్యకు, పరిశ్రమలోని వాస్తవ ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు మధ్య అకాడమీ ఒక వారధిగా పనిచేస్తుందని చెప్పారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారు ఉద్యోగాలు పొందడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను కూడా అందిపుచ్చుకునేలా అకాడమీని తీర్చిదిద్దుతామని తెలిపారు.

**వ్యక్తిగత శ్రద్ధకు ప్రాధాన్యం**

కస్టమర్లకు ప్రీమియం సేవలతో పాటు ప్రశాంతమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని హేమలత రెడ్డి అన్నారు. ప్రత్యేక గదులు, వీఐపీ ట్రీట్మెంట్ సదుపాయాలు, వ్యక్తిగత గోప్యతతో ప్రతి కస్టమర్‌కు ప్రత్యేక శ్రద్ధ అందిస్తున్నామని తెలిపారు. బ్యూటీ సేవలను అందించడంతో పాటు ఈ రంగంలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడం, యువతకు వృత్తిపరమైన శిక్షణ అందించడం ద్వారా పటాన్‌చెరు ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొందేలా హెచ్‌ఆర్ లక్స్ స్టూడియో, బ్యూటీ అకాడమీని అభివృద్ధి చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.



## మాలల బ్రతుకు కోసమే అగస్టు 31న ఛలో సెక్రటేరియట్

**పిల్లి సుధాకర్**
**జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు**





**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 24:**

- రోస్టర్ సవరణ కోరుతూ సిద్దిపేట జిల్లా దుబ్బాకలో నియోజకవర్గ ఇన్చార్జి కాలువ నరేష్ అధ్యక్షతన మాలల మహా ధర్నా
- హాజరైన మాజీ మంత్రివర్యులు సుద్దాల దేవయ్య
- రోస్టర్ విధానం వల్ల మాలల భవిష్యత్తు అందాకారం అయ్యింది
- మాలల హక్కుల సాధన కోసమే ఛలో సెక్రటరియేట్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలల పట్ల వివక్షత విడాలి
- చలో సెక్రటేరియట్ కార్యక్రమం కు వేలాదిగా మాలలు తరలి రావాలి
- రోస్టర్ విధానం సవరించక పోతే ప్రభుత్వంతో సమరమే
- మాలలు ఐక్యంగా కలిసి పనిచేయాలి సుద్దాల దేవయ్య మాజీ మంత్రివర్యులు
- మాల ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకు రావాలి - సర్వయ్య
- రోస్టర్ సవరణ ఉద్యమంలో మాలలు సంఘటితంగా పోరాటం చేయాలి బైరి రమేష్



సుదీర్ఘంగ జరిగిన ఈ సభలో రాష్ట్ర, జాతీయ నాయకులు నల్లాల కనకరాజు, ర్యాకం శ్రీరాములు, అసాది పురుషోత్తం,మేడి అంజయ్య, గోలి సైదులు,, మంచాల లింగస్వామి, వెన్న రాజు,బుట్టి సత్యనారాయణ, ఉదండపురం సత్యనారాయణ, ఎలక దేవయ్య, సామల అశోక్, భీమసేన, తుమ్మ శ్రీను,సీతారాములు,కల్లూరి సంజీవ, నీరటి శ్రీనివాస్,శివరాజ్,పనికల శ్రీనివాస్, ఉసిల్ల ఉదయ్, పొనుగంటి రాజన్న,తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 24:** తెలంగాణ మానవ హక్కుల కమిషన్ టిజిహెచ్ ఆర్ సిగౌరవ చైర్‌పర్సన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు,తరగతి గదులు,మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలపై హెచ్ ఆర్ సి చీ.శీ.2638 శీట 2026, తేదీ 03.08.2026న కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తగిన తరగతి గదులు, మరుగుదొడ్లు మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద, వరండాల్లో, కమ్యూనిటీ భవనాల్లో తరగతులకు హాజరవుతున్నారంటూ 03.07.2026న 'సాక్షి' తెలుగు దినపత్రికలో ప్రచురితమైన వార్త ఆధారంగా కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించింది. కమిషన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్, జనగాం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి నివేదికలు సమర్పించబడ్డాయి. ఆయా నివేదికలను పరిశీలించగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, మరమ్మతులు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్ల కొరత వంటి మౌలిక వసతుల లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. నల్గొండ జిల్లా, నిడమనూరు మండలం, ఊట్కూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా పరిశీలించినట్లు నివేదికలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా పాత రేకుల పైకప్పు తరగతి గదుల్లో లీకేజీలు ఏర్పడటంతో, మరమ్మతులు జరుగుతున్న సమయంలో విద్యార్థులను తాత్కాలికంగా చెట్ల కింద కూర్చోబెట్టి తరగతులు నిర్వహించినట్లు నివేదికలో వెల్లడించారు. విద్యార్థులకు సురక్షితమైన తరగతి గదులు, పారిశుధ్య సౌకర్యాలు, ఇతర ప్రాథమిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కమిషన్ స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ద్వారా కల్పించబడిన విద్యా హక్కు కేవలం పాఠశాలలో ప్రవేశం కల్పించడంతో పరిమితం కాదని, పిల్లలు సురక్షితమైన, గౌరవప్రదమైన, అనుకూలమైన వాతావరణంలో విద్యను అభ్యసించే పరిస్థితులు కూడా అందులో భాగమేనని కమిషన్ పేర్కొంది.

**అన్ని జిల్లాలపై సమగ్ర చర్యలు తీసుకోవాలి**

కమిషన్ పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రాథమిక సౌకర్యాలపై నివేదికలు కోరాలని సిఫారసు చేసింది. అలాగే ఈ అంశాన్ని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి, ప్రభుత్వ పాఠశాలల్లో సురక్షితమైన తరగతి గదులు, పనిచేసే మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు, అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు తక్షణ మరియు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫారసు చేసింది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993లోని సెక్షన్ 18(వ) ప్రకారం కమిషన్ చేసిన సిఫారసులపై తీసుకున్న లేదా ప్రతిపాదించిన చర్యల వివరాలను ఆరు నెలల్లోగా కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ సిఫారసులు, పరిశీలనలతో హెచ్ ఆర్ సి చీ.శీ.2638 శీట 2026లో తదుపరి చర్యలను కమిషన్ ముగించింది.

## ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ భూములను వినియోగించాలి



**ఎంపీ ఈటల రాజేందర్**

**భవిష్యత్ ప్రజాపాలన, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) పరిధిలోని ప్రభుత్వ స్థలాల వేలం ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, వాటిని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేపీహెచ్‌బీ రమ్య గ్రౌండ్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రభుత్వ భూముల వేలం అంశంపై తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను వేలం వేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూములు కేవలం ప్రస్తుత ఆర్థిక అవసరాలను తీర్చేందుకు విక్రయించే ఆస్తులు కాదని, అవి ప్రజల ఆస్తులని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ స్థలాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వాలు ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు విక్రయించినా, లీజుకు ఇచ్చినా,ఆయా భూముల వినియోగంలో ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చేవని ఈటల రాజేందర్ గుర్తు చేశారు. స్థానిక ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండే ధరల్లో గృహాలను నిర్మించి అందించడం వంటి నిబంధనలను అమలు చేసేవారని తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వ భూములను విక్రయించడం సరైన విధానం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. కూకట్‌పల్లి ఇప్పటికే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా మారిందని, జనాభా పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, సామాజిక అవసరాలను ముందుగానే గుర్తించి ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీ పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను పార్కులు, క్రీడా మైదానాలు, వాకింగ్ ట్రాక్‌లు, సీనియర్ సిటిజన్ల కోసం క్లబ్‌హౌస్‌లు, పిల్లల ఆటస్థలాలు, కమ్యూనిటీ సెంటర్లు వంటి ప్రజా అవసరాలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ స్థలాలు ఒకసారి ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయిన తర్వాత భవిష్యత్‌లో ప్రజా అవసరాల కోసం వాటిని తిరిగి సమకూర్చుకోవడం చాలా కష్టమవుతుందని ఈటల రాజేందర్ అన్నారు. అందువల్ల ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను రక్షించడంతో పాటు,స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే విలువైన ప్రభుత్వ భూములను కేవలం ఆదాయ సమీకరణ కోసం వేలం వేయడం వల్ల భవిష్యత్ తరాలకు నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం తక్షణ ఆదాయం కంటే దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను ప్రధానంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి ప్రజల అభిప్రాయాలను, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ప్రభుత్వ భూములపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులుగా భావించి, వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కూకట్‌పల్లి వంటి జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో భవిష్యత్ అవసరాల కోసం ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవడం అత్యంతకీలకమని పేర్కొన్నారు.ప్రభుత్వ స్థలాల వేలం నిర్ణయాన్ని నిలిపివేసి,ఆయా ప్రాంతాల్లోని ప్రజల అవసరాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పార్కులు, క్రీడా మైదానాలు, ప్రజా సౌకర్యాలు,



సామాజిక అవసరాలకోసం స్థలాలను కేటాయిస్తే వేలాది కుటుంబాలకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఆస్తిగా భావించాల్సిన ప్రభుత్వ భూములను కాపాడి,స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని వారు స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి నియోజక వర్గానికి చెందిన బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ భూముల వేలం అంశంపై ఎంపీ ఈటల రాజేందర్ చేసిన డిమాండ్‌పై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

# మేరు కులస్థుల సంక్షేమమే లక్ష్యం

## కుట్టు మిషన్లకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి

- **మేరుల జీవనోపాధికి భరోసా కావాలి.. 45 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలి!**



**చందంపేట భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య:** నేరేడుగోమ్ము మేరు కులస్థులకు రాష్ట్ర ప్రభుత్వం కుట్టు మిషన్లు మంజూరు చేయడంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నేరేడుగోమ్ము మేర సంఘం అధ్యక్షులు రాపర్తి వినయ్ కుమార్ మేరు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుల వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మేరు కులస్థులు ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఉచిత కుట్టు మిషన్ల పథకంలో మేరు కులస్థులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా శ్రమతో అలసిపోయిన మేరు కులస్తులకు అండగా నిలిచేందుకు 45 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నెలవారీ పింఛన్ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కులస్తుల హక్కులకోసం నిరంతరం పోరాడుతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఆరోగ్యమే దీర్ఘాయుష్షు: జూబ్లీహిల్స్‌లో

## 15,000 SFTలో AEVUM Health Hub గ్రాండ్ లాంచ్





- **టాలీవుడ్ స్టార్స్ సందడిలో AEVUM హెల్త్ హబ్ ప్రారంభం - ప్రివెంటివ్ కేర్‌లో కొత్త శకం రోగం వచ్చాక కాదు, రాకముందే జాగ్రత్త! హైదరాబాద్‌లో లాంగెవిటీ మెడిసిన్‌కు కేరాఫ్ AEVUM**
- **జూబ్లీహిల్స్‌లో AEVUM Health Hub ఘన ప్రారంభం - ప్రివెన్షనే లక్ష్యంగా లాంగెవిటీ కేర్**

**హైదరాబాద్:** కేవలం చికిత్స మాత్రమే కాదు, ముందస్తు నివారణ, ఆరోగ్యకర దీర్ఘాయుష్షుపై దృష్టి సారించిన అత్యాధునిక వైద్య కేంద్రం AEVUM Health Hub జూబ్లీహిల్స్‌లో ఘనంగా ప్రారంభమైంది. 15,000 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ ప్రీమియం హబ్‌ను ప్రజా ప్రతినిధులు, వైద్య, వ్యాపార, సినీ ప్రముఖులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే అనిల్ కుంబం, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి హాజరయ్యారు. సినీ గ్లామర్‌తో ఈ వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ హీరో నితిన్ తన కుటుంబంతో, ప్రముఖ నిర్మాత దిల్ రాజు తన కుమార్తె హన్సితా రెడ్డి, అల్లుడితో కలిసి హాజరై సందడి చేశారు. ఎక్కువ కాలం కాదు, ఆరోగ్యంగా ఎక్కువ కాలం జీవించాలి" – ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "స్వాతంత్ర్యం వచ్చేనాటికి 30 ఏళ్లుగా ఉన్న భారతీయుల సగటు ఆయుష్షు ఇప్పుడు 71–72 ఏళ్లకు పెరిగింది. అయితే కేవలం ఆయుష్షు పెరగడం కాదు, ఎన్ని సంవత్సరాలు ఆరోగ్యంగా ఉంటున్నామనేది ముఖ్యం. ూజుఎఖవీ లాంటి సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధారిత కేంద్రాలు ఇప్పుడు అవసరం" అన్నారు. AEVUM Health Hub వ్యవస్థాపకురాలు, CEO డా. మహతి రెడ్డి మాట్లాడుతూ "ఆరోగ్యం అంటే ఒక అవయవం కాదు, మనిషి మొత్తం వ్యవస్థ. మా దగ్గర 10 మందికి పైగా ఇన్-హౌస్ వైద్యులు, 100o బయోమార్కర్లతో కూడిన అసెస్‌మెంట్, VO2 Max, గట్ మైక్రోబయోమ్, కార్డియాక్ స్క్రీనింగ్, AI-ఆధారిత డయాగ్నస్టిక్స్ ఉంటాయి" అని తెలిపారు.

# పదోన్నతుల్లో జీవో 39 రద్దు చేయాలి

- **టీఎన్జీవో నేతలు, డిప్లమా ఏఈవోల డిమాండ్**
- **మారం జగదీష్‌ను కించపరచడంపై నిరసన**

**భవిష్యత్తు ప్రజాపాలన / హిమాయత్ నగర్ :** తెలంగాణ ఎఇఒల ప్రమోషన్ల విషయమై సీనియారిటీ ప్రాతిపదికన కాకుండా చదువు (గ్రాడ్యుయేట్) ప్రాతిపదికన తీసుకొచ్చిన జిఒ.39ను రద్దు చేయాలని టిఎన్ జిఒ సంఘం నేతలు, తెలంగాణ రాష్ట్ర సమస్త డిప్లొమా వ్యవసాయ విస్తరణ అధికారులు (డిప్లమో ఏఈఓ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిప్లొమా ఎఇఒల ఇన్సర్వీస్ బిఎస్సి అగ్రికల్చర్ 5శాతం సీట్లను యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ మేరకు అవమానపరుస్తూ కించపరిచే వ్యాఖ్యలు చేయడంపై పలువురు టిఎన్ జిఒ సంఘం నేతలు, డిప్లొమా ఎఇఒలు ఖండిస్తూ వ్యవసాయ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎఇఒ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ స్టేట్సుబార్డినేట్ సర్వీస్ రూల్సుకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన జిఒ ఎంఎస్ నంబర్ 39తో 1400 మంది డిప్లొమా ఎఇఒలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉన్నదన్నారు. ఇదే విషయమై డిప్లొమా ఎఇఒలకు న్యాయం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మారం జగదీశ్ కలిసి




సోమవారం హైదరాబాద్ బషీరాబాగ్‌లోని అగ్రికల్చర్ ఆఫీసులోని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపితో టిఎన్జఒ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్, టిఎన్ జిఒ ప్రధాన కార్యదర్శి ముజీబ్, టిఎన్ జిఒ అనుబంధ ఎఇఒల సంఘం టిఎఇఒఎస్ అధ్యక్షులు, వివిధ జిల్లాల ఎఇఒలు భేటీ అయ్యారు. ఈ క్రమంలో గ్రాడ్యుయేట్ ఎఇఒ సంఘం నేతలు నవీన్, సుమన్, కె. శ్రవణ్ గౌడ్ తదితరులు డైరెక్టర్ చాంబర్లోకి దూసుకొచ్చి మారం జగదీశ్, ముజీబ్‌లను విన్నవించారన్నారు. జగదీశను పట్టుకొని గ్రాడ్యుయేట్ ఎఇఒలు అవహేళన చేయడం సరికాదన్నారు. గ్రాడ్యుయేట్ ఎఇఒ సంఘం సభ్యుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మారం జగదీష్ లను అవమానపరిచిన నవీన్, సుమన్, కె. శ్రవణ్ గౌడ్పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నిరసన ప్రదర్శనలో ఎఇఒలు సయ్యద్ అక్రమ్, చెలికాని రాజు తోపాటు వందలాది మంది డిప్లొమా ఎఇఒలు పాల్గొన్నారు.

### రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడిన రైతు నాయకుడు, కమ్యూనిస్టు నేత సారంపల్లి మల్లారెడ్డి

## మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 24:** రైతుల హక్కులు, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం ముందుండి అనేక ఉద్యమాలు నడిపించారని గుర్తుచేశారు. రైతు సంఘం నేతగా, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ రుణాలు, విత్తనాలు వంటి వ్యవసాయ రంగానికి సంబంధించిన విస్తృత అంశాలపై నిరంతరం కృషి చేస్తూ జీవితాన్ని రైతుల సంక్షేమం కోసం అంకితం చేసిన నాయకుడు మల్లారెడ్డిని పేర్కొన్నారు. సారంపల్లి మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులకు ముఖ్యమంత్రి గారు సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# రాజకీయ పార్టీల మధ్య సిద్ధాంత వైరుధ్యాలు ఉండొచ్చు...

## కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు ఉండాలి





కేంద్రం వైఖరి సత్సంబంధాలను దెబ్బతీసేలా ఉంది. ప్రధాని మోదీ,బీజేపీ ముఖ్యమంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్లొచ్చు కానీ తెలంగాణ ముఖ్యమంత్రిగా నా పర్యటనను అడ్డుకుంటా రట.. కేంద్రం వైఖరితో తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు రాకుండా పోతాయ న్నదే మా ఆవేదన, తెలంగాణ అభివృద్ధి కోసం కచ్చితంగా కేంద్రంపై ఒత్తిడి తెస్తాం.

# శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో

# శ్రావణమాస శోభ



- **భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఘనంగా అన్నదానం**
- **అన్నదాతలను ఘనంగా సత్కరించిన ఆలయ నిర్వాహకులు**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । ఆగస్టు 24 । చేవెళ్ల నియోజకవర్గం:** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థాన సంచాలిత శ్రీ రాజరాజేశ్వరి సమేత బ్రహ్మసూత్ర మరకత లింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాస రెండో సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా శంకర్‌పల్లి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గండేటి స్వరూప శ్రీరాములు గౌడ్తో పాటు బుల్కాపురం శ్రీశైలం రెడ్డి, కోనాపురం వడ్ల నరసింహాచారి, మందపాటి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన కృపానంద్, చేవెళ్లకు చెందిన ఇంద్రసేన అనూష్ తదితరులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అన్నదానానికి సహకరించిన అన్నదాతలను ఆలయ నిర్వాహకులు స్వామివారి శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామివారి చిత్రపటాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ డీలర్ శ్రీదేవి, రుక్మిణి జగదీశ్వర్ గౌడ్, సావిత్రి సత్యనారాయణ గౌడ్, రఘు లతా గౌడ్, వివిధ పార్టీల నాయకులు, ఆలయ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లిలో రేపు మెగా మొక్కల నాటే కార్యక్రమం

- **ఉదయం 10.30 గంటలకు రిజిస్ట్రేషన్ కార్యాలయం వెనుకవైపు కార్యక్రమం**

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । ఆగస్టు 24 । చేవెళ్ల నియోజకవర్గం :** శంకర్‌పల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం (ఆగస్టు 25) ఉదయం 10.30 గంటలకు మెగా మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని రిజిస్ట్రేషన్ పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం వెనుకవైపు ఉన్న వెంచర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

# జీవో 97తో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను

## గందరగోళంలోకి నెట్టిన తుగ్లక్ రేవంత్ రెడ్డి



బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య:** జీవో 97తో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను గందరగోళంలోకి నెట్టిన తుగ్లక్ రేవంత్ రెడ్డి అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ఆరోపించారు. సోమవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. గత పది రోజులుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తూ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళు న్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించి, విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వల్ల విద్యార్థుల విద్యా భవిష్యత్తుపై అనేక సందేహాలు నెలకొన్నాయని బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. స్కిల్ యూనివర్సిటీ చట్టంలోని నిబంధనలను పరిగణనలోకి తీసుకోకుండా పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను దాని పరిధిలోకి తీసుకురావడం సరికాదని పేర్కొన్నారు. విద్యార్థుల న్యాయమైన పోరాటానికి బిఆర్ఎస్వీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు వారి పక్షాన పోరాడుతామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జీవో 97పై పునరాలోచించి, పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు.

## దేవరకొండలో బెస్ట్ అవైలబుల్ స్కీం (BAS) అమలు చేయాలి




- **అంబేద్కర్ యువజన సంఘం వినతి**

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య:** తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ డివిజన్ అధ్యక్షులు దళిత రత్న ఎర్ర ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈరోజు దేవరకొండ ఎంపీడీవో ఆఫీసులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో ఆర్. సాగర్ గారికి మరియు ఎస్.డబ్ల్యు.ఓ రుణాదేవి మేడం గారికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కీం (BAS) నల్లగొండ జిల్లాలో నల్లగొండ, త్రిపురారం, నకిరేకల్, చండూరు మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేస్తున్నారని, కానీ దేవరకొండ పట్టణంలో గానీ, దేవరకొండ నియోజకవర్గ పరిధిలో గానీ ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాలలో ఈ పథకం అనుసంధానం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం కింద సీట్లు వచ్చినా, పాఠశాలలు దూర ప్రాంతాల్లో ఉండటం వల్ల ఎస్సీ విద్యార్థులు అక్కడికి వెళ్లి చదువుకోలేకపోతున్నారని, దీంతో ఆ సీట్లు వేరే వారికి కేటాయిస్తున్నారని తెలిపారు. దీనివల్ల దేవరకొండ ప్రాంత ఎస్సీ విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవు తున్నారని అన్నారు. నల్లగొండ పట్టణం దేవరకొండ పరిసర గ్రామాల నుండి సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల విద్యార్థులు డే స్కాలర్‌గా వెళ్లి చదువుకునే అవకాశం లేదని, కావున 2026-27 విద్యా సంవత్సరానికి దేవరకొండ పట్టణం మరియు నియోజకవర్గ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను ఒప్పించి దీూూ పథకాన్ని అనుసంధానం చేసి అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గ కార్యదర్శి సుక్క ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగిలో విషాదం

## నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి యువకుడు మృతి



**నార్సింగి:** నిర్మాణంలో ఉన్న ఓ భవనం మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి 25 ఏళ్ల యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆగస్టు 24న ఉదయం 09:30 గంటల ప్రాంతంలో జగ్గిశెట్టి సాయి తేజ (25, తండ్రి: జగ్గిశెట్టి సత్యం) అనే యువకుడు ఆర్కే కన్స్ట్రక్షన్స్ (RK Constructions) సైట్ వద్ద పని చేస్తుండగా, నిర్మాణంలో ఉన్న భవనం మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయి తేజను వెంటనే చికిత్స నిమిత్తం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే, ఆయనను పరీక్షించిన వైద్యులు ఆసుపత్రికి తీసుకు రాకముందే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈ ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# సూర్యతండాలో సీసీ కెమెరాల

## ఏర్పాటుకు రూ.50 వేల విరాళం



**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య :** దేవరకొండ మండలంలోని సూర్యతండా గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకు వచ్చారు. గ్రామ భద్రత కోసం గ్రామస్తులు స్వచ్ఛందంగా రూ.50 వేల విరాళాన్ని పోలీస్ శాఖకు అందజేశారు. జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం విరాళాల సేకరణ చేపట్టామని దేవరకొండ సీఐ వెంకట్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే సూర్యతండా గ్రామస్తులు విరాళం అందించార న్నారు. ఈ నిధులతో గ్రామంలోకి ప్రవేశించే ప్రధాన కూడళ్లు, గ్రామపంచాయతీ పరిసరాలు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సచివాలయంలో ఏర్పాటు చేసిన
## మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 24:** రాష్ట్రాల కలయికనే కేంద్ర ప్రభుత్వం. ఇది భారత దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తి, విద్య, క్రీడలు, పెట్టుబడులు లక్ష్యంగా మా విదేశీ పర్యటన కార్యాచరణ రూపొందించుకున్నాం. తెలంగాణ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఒక కార్యాచరణ తీసుకుని ముందుకెళుతోంది. విదేశీ పర్యటనకు సంబంధించి విదేశాంగ మంత్రిత్వ శాఖకు పూర్తి సమాచారం అందించాం. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఇంగ్లాండ్‌కు అనుమతి ఇచ్చి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించింది. ఈ విషయంలో కేంద్రం వైఖరిని అందరూ తప్పు పట్టారు. నా పర్యటనను తిరస్కరించడమే కాకుండా బీజేపీ నాయకులు రాజకీయంగా నాపై వ్యక్తిగత



పర్యటనను తిరస్కరిస్తున్నామని చెప్పారు ఆ రాజకీయ కారణాలు ఏమిటో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పాలి. ఆగస్టు 17 నుంచి 28 వరకు అమెరికా, కెనడా పర్యటనకు గుజరాత్ ముఖ్యమంత్రికి అనుమతించారు. వైబ్రంట్ గుజరాత్ అని పెట్టుబడుల కోసం గుజరాత్ ముఖ్యమంత్రికి అనుమతి ఇచ్చారు. కానీ తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా అమెరికాలో పర్యటించాలనుకుంటే ప్రయత్నిస్తున్నాం..ఇందుకు విదేశీ పర్యటనలు ఉపయోగపడుతాయని భావించాం ప్రధాని ఇంకా గుజరాతీగానే వ్యవహరిస్తున్నారు తప్ప భారత ప్రధానిగా వ్యవహరించడం లేదు. ఇది రేవంత్ రెడ్డికి వ్యక్తిగతంగా జరిగిన అవమానం కాదు. ఇది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయం. దీనిని రాజకీయాలకు అతీతంగా ఖండించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటనను కేంద్రం అడ్డుకోవడం అడ్డుకోవడమే, మేమంతా కేంద్రం వైఖరిని ముక్త కంఠంతో ఖండిస్తున్నాం. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం.నా పర్యటనను అడ్డుకోవచ్చు.. నా లక్ష్యాన్ని చేరుకోకుండా అడ్డుకోలేరు. ఇన్వెస్ట్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 ను డిసెంబర్ 8,9 తేదీల్లో నిర్వహిస్తున్నాం.. విద్య, క్రీడల్లో పెట్టుబడులను ఆహ్వానిస్తాం, ముఖ్యమంత్రి సరైన వివరాలు ఇవ్వలేదని మాట్లాడుతున్నారు.. ఇది అధికారిక పర్యటన.. మా కార్యక్రమాలు అన్నీ భారత





ఆరోపణలు చేశారు. బీజేపీ నాయకులు విచక్షణ కోల్పోయి ప్రభుత్వంపై, అధికారిక పర్యటనపై తప్పుడు ప్రకటనలు చేశారు. బీజేపీ వైఖరిపై రాజకీయ అంశాలను నేను ప్రస్తావించదలచుకోలేదు. ఇది రెండు ప్రభుత్వాలకు సంబంధించిన అంశం అమెరికా పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు సమర్పించాం. రాజకీయపరమైన నిర్ణయాలతో అడ్డుకున్నారు. నిజంగా నా విదేశీ పర్యటనలో విషయం లేదనుకుంటే ఇంగ్లాండ్ కు ఎందుకు అనుమతి ఇచ్చారు? అమెరికాకు ఎందుకు తిరస్కరించారు? మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఇంగ్లాండ్‌లో చదువుకుని దేశానికి దార్శనికులుగా మారారు ఆర్థికంగా వెనకబడిన వారు విదేశాల్లో చదువుకునే పరిస్థితి ఉండదు. విదేశీ చదువులను, క్రీడలను ఇక్కడికి తీసుకురావాలని మేం తెలంగాణ అభివృద్ధిని వ్యతిరేకించడమే కేంద్రం వైఖరి చూస్తోంటే స్పష్టంగా తెలంగాణపై వివక్ష కనిపిస్తోంది. మా ఎంపీలు ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తారు. గుజరాత్ అభివృద్ధికి ఇబ్బంది కలుగుతుందనే నా పర్యటనను కేంద్రం అడ్డుకుంది ఇది రాజకీయ వివక్ష... తెలంగాణ అభివృద్ధిని రాయబార కార్యాలయం పర్యవేక్షణలో జరుగుతుంది. ఇది చాటు మాటుగా జరిగే వ్యవహారం కాదు.. అన్ని వివరాలను విదేశీ వ్యవహారాల శాఖకు అందించాం. తెలంగాణ అంటే మోదీకి వివక్ష.. చిన్న చూపు.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు గుజరాతీ నాయకత్వం చేస్తున్న కుట్ర.

## కేంద్రం వైఖరి సత్సంబంధాలను దెబ్బతీసేలా ఉంది





రాజకీయ పార్టీల మధ్య సిద్ధాంత వైరుధ్యాలు ఉండొచ్చు... కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు ఉండాలి. ప్రధాని మోదీ, బీజేపీ ముఖ్యమంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్లొచ్చు కానీ తెలంగాణ ముఖ్యమంత్రిగా నా పర్యటనను అడ్డుకుంటారట, కేంద్రం వైఖరితో తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు రాకుండా పోతాయన్నదే మా ఆవేదన.. తెలంగాణ అభివృద్ధి కోసం కచ్చితంగా కేంద్రంపై ఒత్తిడి తెస్తాం.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు



- **గంగారంలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం**
- **అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి: సర్పంచ్ దేవేందర్ నాయక్**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన, రంగారెడ్డి జిల్లా :** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గంగారం గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ అన్నారు. గంగారం గ్రామపంచాయతీ పరిధిలోని గంగారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన గూడ మంగమ్మ-మల్లేష్ నూతన ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. “పేద కుటుంబం సొంతింట్లో గౌరవంగా జీవించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా గ్రామస్థాయి నుంచి కృషి చేస్తాం” అని దేవేందర్ నాయక్ పేర్కొన్నారు.

**ఆదర్శ గ్రామపంచాయతీగా గంగారం**

మహేశ్వరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కేఎల్ఆర్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేస్తున్నారని తెలిపారు. గంగారం గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ



పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతున్నాయని, సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు.

**లబ్ధిదారుల ఆనందం**

ఇందిరమ్మ ఇల్లు పొందిన గూడ మంగమ్మ-మల్లేష్, ఆగమయ్య, యాదయ్య, శ్రీనివాస్ తదితర లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, సొంతింటి కల నెరవేరడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

**పలువురి పాల్గొనడం**

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్, ఉప సర్పంచ్ మహేందర్, విలేజ్ సెక్రటరీ మహేష్, వార్డు సభ్యులు ఎం. మోహన్, ఎం. రవి, ఎం.ధర్మ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు గూడ మంగమ్మ-మల్లేష్, ఆగమయ్య, యాదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.నూతన గృహప్రవేశం సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# బస్టాండ్ ఉన్నా రోడ్డుపైనే
## బస్సుల కోసం ఎదురుచూపులు





- **లక్షలు ఖర్చు.. ఉపయోగం శూన్యం! గుండాల బస్టాండ్ దుస్థితి**
- **రోడ్డుపైనే మహిళలు, వృద్ధులు, విద్యార్థుల నిరీక్షణ అధికారుల తీరుపై ప్రజాగ్రహం**

**గుండాల, ఆగస్టు 24 యాదాద్రి జిల్లా భవిషత్ ప్రజా పాలన:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో నూతన బస్టాండ్ భవనం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. ప్రయాణికులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో అట్టహాసంగా నిర్మించిన బస్టాండ్ భవనం అందుబాటులో ఉన్నప్పటికీ, ఆర్టీసీ బస్సులు మాత్రం లోపలికి రాకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు ప్రజలకు సౌకర్యం కల్పించాల్సిన బస్టాండ్.. ఇప్పుడు అలంకారప్రాయంగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు. బస్సుల కోసం ప్రయాణికులు ప్రధాన రహదారిపైనే నిలబడాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ఎండ, వానలను లెక్కచేయకుండా రోడ్డుపైనే బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. రద్దీ సమయంలో రహదారిపై ప్రయాణికులు నిలబడటం వల్ల ప్రమాదాల భయం కూడా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. “ప్రజాధనం ఖర్చు చేసి ఉపయోగం లేకపోతే ఎందుకు గత ప్రభుత్వం ప్రజాధనంతో నిర్మించిన నూతన బస్టాండ్ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులు, అధికారులపై ఉందని స్థానికులు అంటున్నారు. భవనం నిర్మాణానికి నిధులు కేటాయించగలిగినప్పుడు దానిని వినియోగంలోకి తీసుకురావడంలో ఇంత జాప్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లు గడుస్తున్నా గుండాల బస్టాండ్ సమస్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి నిత్యం వివిధ గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుండటంతో బస్టాండ్ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.ప్రజల కోసం నిర్మించిన భవనం ప్రజలకే ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని, ఇకనైనా నిర్లక్ష్యం వీడి బస్టాండ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గుండాల ప్రజలు కోరుతున్నారు.

# కొండాపూర్‌లో ఘనంగా చిరంజీవి హాస్పిటల్ ప్రారంభోత్సవం



**భవిష్యత్ ప్రజాపాలన శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్‌లో డాక్టర్ సంజీవరావు, డాక్టర్ శిల్ప దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన చిరంజీవి హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే, ౼ాజ చైర్మన్ శ్రీ అరికపూడి గాంధీ గారితో కలిసి శ్రీ గొట్టుముక్కల వెంకటేశ్వర రావు (GVR) గారు ముఖ్య అతిథిగా హాజరై నూతన ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ సంజీవరావు, డాక్టర్ శిల్ప గార్లు అతిథులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అరికపూడి గాంధీ గారు, GVR గారు ఆసుపత్రి ప్రాంగణాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలు, చికిత్సా విభాగాలు, రోగులకు అందించనున్న సేవలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆధునిక సదుపాయాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ అరికపూడి గాంధీ మాట్లాడుతూ.. కొండాపూర్, శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాల్లో జనాభా రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో స్థానికంగా నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్యం అందించడంతో పాటు, ఆధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా చిరంజీవి హాస్పిటల్ ప్రజలకు ఉపయోగకరంగా నిలవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా GVR గారు మాట్లాడుతూ.. వైద్య రంగంలో సేవా దృక్పథంతో ముందుకు సాగుతూ ప్రజలకు






మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చిరంజీవి హాస్పిటల్ ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమన్నారు. ఆసుపత్రి ద్వారా కొండాపూర్‌తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ఆసుపత్రి నిర్వాహకులు రోగుల ఆరోగ్యాన్ని ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని సేవలు అందించాలని సూచించారు. అనంతరం డాక్టర్ సంజీవరావు గారు ఎమ్మెల్యే అరికపూడి గాంధీ గారిని, GVRగారిని పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతించారు. అనంతరం శాలువాలతో సత్కరించి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులు, వైద్యులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులకు డాక్టర్ సంజీవరావు, డాక్టర్ శిల్ప గార్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చిరంజీవి హాస్పిటల్ ప్రారంభంతో కొండాపూర్ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రానున్నాయని నిర్వాహకులు తెలిపారు. అత్యవసర వైద్యం, సాధారణ వైద్య సేవలు, నిపుణుల సలహాలు తదితర సేవలను ప్రజలకు అందించేందుకు ఆసుపత్రిని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రముఖులు, అభిమానులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని నూతనంగా ప్రారంభమైన చిరంజీవి హాస్పిటల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రి విజయవంతంగా కొనసాగుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో
## విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయొద్దు



**హైదరాబాద్:** ఈరోజు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి గారిని కలిసి విద్యార్థుల సమస్యల పై వినతిపత్రం సమర్పించడం జరిగింది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు ఆలస్యం అవుతున్నాయనే కారణంతో కొన్ని కళాశాలలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు,మార్కుల మెమోలు, డిగ్రీ/ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు నిలిపి వేస్తున్నట్లు కమిటీ దృష్టికి వచ్చిన విషయాన్ని చైర్మన్ గారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం-కళాశాలల మధ్య ఉన్న ఆర్థిక సమస్యకు విద్యార్థులను బాధ్యులను చేయడం సరికాదని, సర్టిఫికెట్లు లేకపోవడం వల్ల ఉద్యోగాలు, ఉన్నత విద్య, పోటీ పరీక్షలు వంటి అవకాశాలను విద్యార్థులు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని డా.చంటి ముదిరాజ్ తెలిపారు. అందువల్ల విద్యార్థుల సర్టిఫికెట్లను వెంటనే విడుదల చేయించేలా రాష్ట్రవ్యాప్తంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని, సర్టిఫికెట్లు నిలిపివేస్తున్న కళాశాలలపై విచారణచేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కమిటీ కోరింది విద్యార్థి సర్టిఫికెట్ అతని భవిష్యత్తుకు తాళంచెవి- ఆర్థిక బకాయిల పేరుతో దాన్ని బందీ చేయకూడదు అని డా. చంటి ముదిరాజ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరవింద్ యాదవ్ సహాయ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రెస్ మీట్ ఏ తెలంగాణ భవన్ ....




ఎల్ నినో పేరుతో రైతుల నోట్లో మట్టికొడుతుంది. పాలమూరు పంపులు, కేఎల్ఐ, జూరాల పంపులు నిరంతరాయంగా నడపాలి. కాంగ్రెస్ ప్రభుత్వం నోరు తెరవాలి .. లేకుంటే సర్కారు దుర్మార్గాన్ని ఎండగడతాం.. వరదలేకున్నా రోజుకు 5 వేల క్యూసెక్కుల నీళు ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుండి రీజనరేటెడ్ వాటర్ జూరాలకు వస్తాయి. నీళ్లు లేవని రైతులను పంటలు వేయకుండా ప్రభుత్వం భయపెట్టింది .. సర్కారు భయానికి సగం మంది రైతులు పంటలు సాగు కూడా చేయలేదు.. పంటలు వేయొద్దు. పంటలు కొనొద్దు. బోనస్ ఇవ్వొద్దు అన్నట్లు ఎల్ నినో పేరుతో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నది. క్రిష్ణా నది మీద ఉన్న తొలి ప్రాజెక్టు జూరాల. దాని సామర్థ్యం కేవలం 6 టీఎంసీలు, శ్రీశైలం రిజర్వాయర్‌లో 854 అడుగులకు చేరిన వెంటనే ఏపీ పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంది. హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు పేరుతో శ్రీశైలం నిర్మించి, మద్రాసుకు తాగునీరు పేరుతో వెళ్లే దారిలో రైతులకు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అని పోతిరెడ్డిపాడును మొదలుపెట్టారు. వైఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత 11 వేల క్యూసెక్కులు తరలించే పోతిరెడ్డిపాడును అదనంగా మరో 44 వేల క్యూసెక్కులు తరలించేలా ఉమ్మడి రాష్ట్రంలో యుద్ద ప్రాతిపదికన పూర్తి చేశారు. అదే సమయంలో 235 టీఎంసీల సామర్థ్యంగల రిజర్వాయర్లను నిర్మించారు. ఈ రిజర్వాయర్లకు ఎలాంటి అనుమతులు, నీటి కేటాయింపులు లేకున్నా నిర్మించారు. అదే సమయంలో తెలంగాణలో కూడా ప్రాజెక్టులు చేపట్టాం అని చూయించేందుకు జూరాల మీద మొక్కుబడిగా పనులు చేపట్టారు. శ్రీశైలం రిజర్వాయర్ మీద ఆధారపడ్డ ఎస్ఎల్ బీసీ ప్రాజెక్టును మూడు దశాబ్దాలుగా పెండింగ్ పెట్టారు. కేఎల్ఐ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.2800 కోట్లు ఖర్చు పెట్టి పూర్తి చేయడం జరిగింది. దీనిని 200 పైచిలుకు రోజులు నడుపుకున్న 40 టీఎంసీలు కూడా వాడుకునే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలోనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీశైలం రిజర్వాయర్ నుండి సాగునీరు ఎత్తిపోసుకునేలా కేసీఆర్ పూర్తిగా రాష్ట్ర నిదులతో నిర్మించారు. దీనిని అడ్డుకునేందుకు ఏపీ ప్రభుత్వం, తెలంగాణ ఇంటిదొంగలు శతవిధాల కేసులు వేసి ప్రయత్నించారు. అన్ని అడ్డంకులు దాటుకుని కేసీఆర్ అన్ని అనుమతులు సాధించి నిర్మించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.600 లేదా రూ.700 కోట్లు ఖర్చు పెడితే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పరిధిలోని రిజర్వాయర్లు నింపుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎల్నినో వచ్చినా పాలమూరు రైతాంగానికి సాగునీరు అందేది. భూగర్భజలం పెరిగేది. అందాల పోటీలు, మెస్సీతో ఫుట్ బాల్ కోసం పెట్టిన ఖర్చు దీనికి పెడితే రైతాంగానికి సాగునీరు అందేది. శ్రీశైలంలో 100 టీఎంసీల నీళ ఉన్నప్పుడు కూడా పాలమూరు రైతాంగానికి రెండు పంటలకు సాగునీరు అందించాం. ప్రస్తుతం కూడా శ్రీశైలం రిజర్వాయర్లో 170 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. కేఎల్ఐ కాలువ చివరి వరకు సాగునీరు వెళ్లకపోవడం జిల్లా మంత్రుల అసమర్థతకు నిదర్శనం, రోజుకు సగటున ఏపీ ప్రభుత్వం 12 టీఎంసీల నీళ్లను ఏపీకి తరలిస్తున్నది. తెలంగాణ నీళ్లు ఎలా ఇవ్వొద్దు అని ఏపీ చీఫ్ సెక్రటరీ, ఇరిగేషన్ సెక్రటరీ ఆదిత్యానాథ్ దాస్ ను తీసుకువచ్చి తెలంగాణ ప్రభుత్వం సిగ్గులేకుండా ఉద్దేశపూర్వకంగా సలహాదారుగా పెట్టుకుంది. ఎన్నిసార్లు ఎత్తిచూపినా ఈ ప్రభుత్వానికి సోయి రావడం లేదు. ఆంధ్రా ప్రయోజనాల కోసమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తున్నది. జలయజ్ఞంలో భాగంగా వైఎస్ 840 అడుగుల వద్ద వెలుగోడు ప్రాజెక్టుకు టన్నెల్స్ నిర్మించారు. దీనికింద 53 టీఎంసీల సామర్థ్యం ఉన్న నల్లమల సాగర్ రిజర్వాయర్ ను నిర్మించారు. త్వరలో ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. శ్రీశైలంలో 854 అడుగుల దిగువకు నీళ్లు వెళ్తే 840 అడుగుల వద్ద షటర్ ఎత్తి సాగునీళ్లు ఎత్తుకెళ్తారు. వెలుగోడు ద్వారా నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వ 9.2 దయామీటర్, 7.2 దయామీటర్ల వెడల్పుతో సొరంగాలని నిర్మించడం పూర్తి చేసింది. అటవీ అనుమతులు, కేంద్ర జలవనరుల శాఖ అనుమతులు ఏవీ లేకుండా, అన్నీ పక్కన పెట్టి అక్కడ పనులు పూర్తి చేస్తున్నారు. ఈ నీటి దోపిడీని అడ్డుకోకుండా జిల్లా మంత్రి సిగ్గూ ఎగ్గూ లేకుండా శ్రీశైలం డ్యామ్ వద్ద ధర్నా చేస్తానని చెబుతున్నాడు. చేతనైతే ఆంధ్రా నీటి దోపిడీ మీద కేఆర్ఎంబీ ముందుకు వెళ్లి కొట్లాడాలి. ఏం ఆశించి తెలంగాణ రిజర్వాయర్లు, ఎత్తిపోతల పనులను పూర్తి చేయకుండా ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీలో ఎవరు ఉంటారో? ఎవరు పోతారో? వారి ఇష్టం. వాటితో ప్రజలకు, రైతులకు సంబంధం లేదు. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో మంత్రులు లేరు. కొన్ని శాఖలకు దిక్కులేదు. సర్కారు నడుపుతున్నారా? సర్కస్ నడుపుతున్నారా? ప్రభుత్వంలో ఒకరి మీద ఒకరికి నియంత్రణ లేదు .. సాగర్ నిండినా సాగునీళ్లు ఇవ్వం అని మంత్రి చెప్పడం ఎంత చేతగానితనం. మీకు చేతకాదు అంటే చేతకాదు అని ప్రజలకు చెప్పాలి. ఆంధ్రా సాగునీటి దోపిడీని అడ్డుకోకుంటే అత్యంత దుర్మార్గమైన ప్రభుత్వంగా ఇది చరిత్రలో నిలిచిపోతుంది. ఈ ప్రెస్ మీట్ లో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బీరం హర్షవర్ధన్ రెడ్డి,గాదరి కిషోర్ కుమార్, బీ ఆర్ ఎస్ నేత అభిలాష్ రంగినేని పాల్గొన్నారు.

## శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన శాసనమండలి (లెజిస్లేచర్) మైనారిటీల సంక్షేమ కమిటీ మరియు షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ ప్రారంభ సమావేశం






**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 24:** హాజరైన శాసన పరిషత్ చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, హాజరైన లెజిస్లేచర్ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్. హాజరైన శాసనమండలి ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం గారు, సభ్యులు వెద్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య. హాజరైన శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి.

- ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో అభినందనలు తెలిపిన చైర్మన్, స్పీకర్ సెక్రటరీలు

**ఈ సందర్భంగా చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ..**

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది, ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం మానిటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలి. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నది. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని, షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలి.

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...**

నేను కూడా 2008లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించాను. తెలంగాణ ఎప్పటినుంచో "గంగా– జమున తెహజీబ్"కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లిములు, క్రిష్టియన్లు మరియు ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే



కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు,ఆహారం,సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలి. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహన తోఅధికారులతో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించ డానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను.

## గుంతలమయంగా బడంగ్‌పేట్ రహదారి!

- **సీసీ రోడ్డును తవ్వేశారు.. మరమ్మతులు మరిచారు**
- **ఎన్నికల వేళ ఇంటింటికీ వచ్చి హామీలు.. ఇప్పుడు ప్రజల గోడు పట్టదా?**
- **రోడ్డు భద్రత ఎక్కడ? అభివృద్ధి ఎక్కడ? నాయకులు ఎక్కడ?**

**మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన రంగారెడ్డి జిల్లా :** బాలాపూర్ మండలం బడంగ్‌పేట్‌లోని శ్రీనిలయం కమాన్ ఎదురుగా, మద్రాస్ కాఫీ సమీపంలో రహదారి గుంతలమయంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ వైర్ల పనుల కోసం మంచి సీసీ రోడ్డును తవ్వి గుంతలు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవ్విన గుంతలను సక్రమంగా పూడ్చకపోవడంతో నిత్యం ప్రమాదభయం నెలకొన్నదని మహిళలు, వాహనదారులు, కాలనీ నాయకులు వాపోతున్నారు. వర్షం పడితే గుంతల్లో నీరు చేరి రోడ్డు ఎక్కడుందో.. గుంత ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంటోందని, ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రహదారిపై నడిచేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**ఎన్నికల హామీలు ఏమయ్యాయి?**

ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో బడంగ్‌పేట్ అభివృద్ధికి పెద్దపీట వేస్తామని, ఇంటింటికీ తిరిగి సీసీ రోడ్లు వేస్తామని, ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన రాజకీయ నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రజల సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఎన్నికల సమయంలో ఇంటింటికీ వచ్చి హామీలు ఇవ్వడం కాదు.. గెలిచిన తర్వాత అదే ప్రజల మధ్యకు వచ్చి సమస్యలు పరిష్కరించాలి. సన్మానాలు, సభలు, గొప్పలు కాదు.. ప్రజలకు సురక్షితమైన రోడ్లు కావాలి" అని స్థానికులు ఘాటుగా వ్యాఖ్యానిస్తున్నారు.

**సన్మానాలకే పరిమితమా?**

ప్రజా సమస్యలపై నాయకులను కలవడానికి వెళ్తే సన్మానాలు, ఫొటోలు, హామీలతో సరిపెడుతున్నారని, సమస్యలను నేరుగా వివరించేందుకు అవకాశం లేకుండా కొందరు నాయకులు పీఏల ద్వారా విషయాలు చెప్పించి పంపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల మధ్య ఉండాల్సిన ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు అభివృద్ధి విషయంలో ఎవరి బాధ్యత వారు తీసుకోవాలని, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం కాకుండా రహదారుల పరిస్థితిని స్వయంగా పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**రోడ్డు భద్రతపై ఇంత నిర్లక్ష్యమా?**

"అభివృద్ధి అంటే సన్మానాలు కాదు.. ప్రజలు సురక్షితంగా నడిచే రహదారులు. నాయకుల గొప్పలు కాదు.. గుంతలు లేని రోడ్లే ప్రజలకు




కావాలి" అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. గుంతల కారణంగా ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

**పట్టించుకోకపోతే ఎన్నికల్లో బుద్ధి చెబుతాం**

బడంగ్‌పేట్‌లోని రహదారుల దుస్థితిని ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలే తమ నిర్ణయాన్ని చూపిస్తారని స్థానికులు హెచ్చరిస్తున్నారు. "ప్రజల ఓట్లతో పదవులు వస్తాయి.. అదే ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే ప్రజల తీర్పును ఎదుర్కోవాల్సిందే" అని నాయకులు, స్థానికులు హెచ్చరించారు. మహేశ్వరం నియోజకవర్గంలో బడంగ్‌పేట్ వంటి ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి దయనీయంగా మారడం బాధాకరమని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. బడంగ్‌పేట్ రహదారుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే స్థానికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## మంత్రి కొండా సురేఖపై చర్యలకు పోతే అగ్గి పుట్టిస్తాం




- **కాంగ్రెస్‌కు బీసీ నేతల హెచ్చరిక**

**భవిష్యత్తు ప్రజాపాలన /హిమాయత్ నగర్ :** కాంగ్రెస్ పార్టీ మంత్రి కొండా సురేఖపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకొన్నా రాష్ట్రంలో అగ్గిపుట్టిస్తామని పలువురు బిసి సంఘం నేతలు హెచ్చరించారు. మూడేళ్లుగా బిసిలను చిన్నచూపు చూస్తూ వారిని అణచివేయాలని దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ బషీరాబాగ్ ప్రెస్ క్లబ్లో బిసి ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు వాసు కె యాదవ్, బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షులు బొంగు ప్రసాద్, జై గౌడ్ ఉపాధ్యక్షురాలు నీరజ గౌడ్, మన ఆలోచన సాధన సమితి అధ్యక్షులు కటకం నర్సింగరావు, బిసి ఫెడరేషన్ అధ్యక్షులు సి.హెచ్.రాములు ముదిరాజ్ మీడియాతో మాట్లాడారు. ఎంఎల్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనేకసార్లు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినా ఆయనను పట్టించుకోలేదన్నారు. కానీ, బిసి బిడ్డ మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మిత చేసిన వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకొనే అవసరం ఏం వచ్చిందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో రెడ్లకో న్యాయం, బిసిలకో న్యాయమా? అంటూ నిలదీశారు. బిసి సమాజంపట్ల కుటిల వైఖరి వీడనాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసిలంతా ఏకతాటిపైకి కొచ్చి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తారని హెచ్చరించారు.

## టీఎన్జీవో నేతల దాడిని ఖండిస్తున్నాం




- **బషీర్బాగ్ అగ్రికల్చర్ కమిషనరేట్ ముందు గ్రాడ్యుయేట్ ఏఈఓల నిరసన ప్రదర్శన**

**భవిష్యత్తు ప్రజాపాలన /హిమాయత్ నగర్ :** గ్రాడ్యుయేట్ ఎఇఒల పదోన్నతుల నిమిత్తం తెచ్చిన జి.ఒ.39 అమలుకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు సోమవారం అగ్రికల్చర్ కమిషనరేట్కు వెళ్లిన గ్రాడ్యుయేట్ అగ్రికల్చర్ ఎఇఒలపై టిఎన్జిఒ నేతలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గ్రాడ్యుయేట్ ఎఇఒల అసోసియేషన్ పేర్కొన్నది. అసోసియేషన్ నేతలు నవీన్, సుమన్, కె.శ్రవణ్ గౌడ్లు కలిసి గ్రాడ్యుయేట్ల ఎఇఒల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిశీలించాల్సిందిగా అగ్రికల్చర్ కమిషనర్ గోపిని కలిసేందుకు వెళ్తే అక్కడే ఉన్న టిఎన్జిఒ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టిఎఇఒ అసోసియేషన్ నేతలు దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఈ ఘటనపై అబిడ్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని గ్రాడ్యుయేట్ ఎఇఒలు తెలిపారు. అంతకుముందు అగ్రికల్చర్ కమిషనర్ ఆఫీసు ముందు దాడిపై నిరసన వ్యక్తం చేశారు.

## కమలాపూర్‌లో అంబరాన్నంటిన భక్తి పారవశ్యం.. భద్రకాళి సమేత వీరభద్రుని వైభవోపేత ఊరేగింపు





- **వర్షాల కోసం వరద పాశం.. ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న వీరభద్ర స్వామి జాతర**
- **భక్తజన సందోహం నడుమ భైరవుని గుట్టకు చేరిన భద్రకాళి, వీరభద్ర స్వాములు**

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య:** ముదిగొండ/కమలాపూర్, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ కమలాపూర్ గ్రామంలో సోమవారం శ్రీభద్రకాళి సమేత శ్రీవీరభద్ర స్వామి వార్ల ఊరేగింపు అత్యంతవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాలు, భక్తి సంకీర్తనల నడుమ గ్రామ ప్రధాన వీధుల గుండా స్వామి వార్లను ఘనంగా ఊరేగించారు. మహిళలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం గ్రామ శివారులోని భైరవుని గుట్టపై కొలువైన భైరవస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఆనవాయితీ ప్రకారం 'వరద పాశం' పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, రైతులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

# జిల్లా పరిషత్ హై స్కూల్ రామంతపూర్‌లో

- అల్పాహారాన్ని పరిశీలించిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు






**ఉప్పల్,ఆగష్టు 24 (భవిష్యత్ ప్రజాపాలన):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ఉప్పల్ సర్కిల్ రామంతపూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రాథమిక పాఠశాల నందు విద్యార్థులకు అందజేస్తున్న అల్పాహారాన్ని పరిశీలించారు. వారు టెస్ట్ చేశారు వారానికి ఐదు రకాల టిఫిన్స్ ను విద్యార్థులకు అందజేయడంతో పాటు పాలను అందజేస్తున్నారు పరిశీలించిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందజేస్తున్న అల్పాహారం చాలా బాగుందని, వాటిని తెస్తున్న డబ్బాలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండేలాగా చర్యలు తీసుకోవాలని రామంతపూర్ స్కూల్ నందు చాలా సమస్యలు ఉన్నాయి విద్యార్థులు ఎక్కువగా ఉండటం వల్ల చదువుకోవడానికి క్లాస్ రూములు లేక సోలార్ ప్యానల్ కింద చదువుకునే పరిస్థితి ఏర్పడ్డది ప్రైమరీ స్కూల్ నందు ప్లే స్కూల్ విద్యార్థులకు క్లాస్ రూమ్ చిన్నగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని స్కూల్ నందు నీటి సౌకర్యం లేకపోవడంతో త్రాగడానికి మరియు వాష్ రూమ్ లో వాడుకోవడానికి సరిపోకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని , విద్యార్థులు సైకిల్ పెట్టుకోవడానికి స్థలం లేక రోడ్డుపైనే వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడ్డది పైన వివరించిన సమస్యలను అధికారుల దృష్టికి, పాలకుల దృష్టికి తెచ్చినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రామంతపూర్ స్కూల్ నందు గల సమస్యలను పరిశీలించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోసుల విజయ్ కుమార్ ఉపాధ్యక్షులు టి రవీందర్రావు పాల్గొన్నారు.

# ఫతేపూర్ వద్ద అధ్వానంగా శంకర్‌పల్లి వికారాబాద్ ప్రధాన రహదారి

- గుంతలతో ప్రయాణికులకు నరకయాతన - వర్షం పడితే రోడ్డుపైనే నీటి నిల్వలు
- ప్రమాదాల ముప్పు పొంచి ఉన్నా పట్టించుకోని అధికారులు
- గుంతలు పూడ్చి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల డిమాండ్

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి ఆగస్టు 24 చేవెళ్ల నియోజకవర్గం :** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫతేపూర్ గ్రామం వద్ద శంకర్‌పల్లి--వికారాబాద్ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రహదారి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. ముఖ్యంగా ఫతేపూర్ బ్రిడ్జి ప్రాంతంలో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయి చిన్న చెరువును తలపించే పరిస్థితి నెలకొంటోంది. నీటిలో గుంతలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి దుస్థితిపై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని ఫతేపూర్ వార్డు కౌన్సిలర్ పిచారి అఖిల యాదవరెడ్డి తెలిపారు. కనీసం గుంతలను కూడా పూడ్చకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, గత కొన్ని రోజులుగా ఈ రహదారిపై పలువురు ప్రమాదాలకు గురైనట్లు ఆమె పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఉన్న గుంతలను తక్షణమే పూడ్చడంతో పాటు, ఫతేపూర్ బ్రిడ్జి ప్రాంతంలో వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని కౌన్సిలర్ పిచారి అఖిల యాదవరెడ్డి, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



# చంద్రాయణగుట్టలో జోరుగా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు

- ప్రజలంతా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మిస్ అవుతున్నారు
- మత, కులాలకు అతీతంగా బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు - షేక్ ఫజల్



**రంగా రెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** చంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. సభ్యత్వ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేసి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జ్ షాహీన్ అఫ్రోజ్ సోమవారం సంతోష్‌నగర్‌లోని బానోనగర్‌లో మాజీ చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై నాయకులతో సమగ్రంగా చర్చించారు. ప్రతి డివిజన్, ప్రతి బూత్ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని, పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకుడు షేక్ ఫజల్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనను ఎంతగానో మిస్ అవుతున్నారని అన్నారు. “మతం, కులం, ప్రాంతం అనే తేడా లేకుండా ప్రజలంతా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజల్లో ఉన్న ఈ ఆదరణే సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అద్భుతమైన స్పందన రావడానికి ప్రధాన కారణం” అని షేక్ ఫజల్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా పేదలు, రైతులు, మహిళలు, యువత, బలహీన వర్గాల కోసం చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఉందన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ విధానాలను వివరించడంతో పాటు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో షేక్ ఫజల్ అందిస్తున్న సేవలను షాహీన్ అఫ్రోజ్ ప్రశంసించారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేస్తూ ప్రజలతో మమేకమవుతున్న నాయకులు, కార్యకర్తల కృషి వల్లే సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతోందన్నారు. “ప్రజల మధ్యే ఉండాలి.. ప్రజల సమస్యలను తెలుసుకోవాలి.. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి వివరించాలి. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కూడా ప్రజలకు వివరించి, వాస్తవ పరిస్థితులను వారికి తెలియజేయాలి. బీఆర్ఎస్ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే మనందరి లక్ష్యం కావాలి” అని షాహీన్ అఫ్రోజ్ సూచించారు. చంద్రాయణగుట్ట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఉన్న బలమైన క్యాడర్‌ను మరింత సమన్వయం చేసుకుంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలు నిర్ణయించారు. ప్రతి కార్యకర్త కనీసం మరికొందరిని పార్టీలోకి తీసుకురావడంతో పాటు, బీఆర్ఎస్ విధానాలు, గత ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదుకు వస్తున్న స్పందన బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతోందని నాయకులు తెలిపారు. రానున్న రోజుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించి చంద్రాయణగుట్టలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని వారు పేర్కొన్నారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ సమస్యపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు వినతి



**రంగా రెడ్డి జిల్లా, మహేశ్వరం భవిష్యత్ ప్రజాపాలన:** సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ కారణంగా గిరిజనులు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ బంజారా సేవాదళ్ ప్రతినిధులు జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. డంపింగ్ యార్డ్ వల్ల ఏర్పడుతున్న పర్యావరణ కాలుష్యం, దుర్వాసన, పారిశుద్ధ్య సమస్యలు, ప్రజారోగ్యంపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. బంజారా సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు నేనావత్ అజయ్ నాయక్, రాష్ట్ర అధ్యక్షులు రఘురామ్ రాథోడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ రాథోడ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ జాటోత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, దీనిపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

**ప్రజల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యం**

డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, వ్యర్థాల నిర్వహణలో లోపాలు, పరిసరాల్లో నెలకొంటున్న అపరిశుభ్ర పరిస్థితులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని నాయకులు తెలిపారు. ముఖ్యంగా గిరిజనులు, పేదలు, స్థానిక నివాసితులు ఈ సమస్య ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యం, జీవించే హక్కును కాపాడే విధంగా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వివరించారు. “వ్యర్థాల భారాన్ని ప్రజల జీవితాలపై మోపడం అభివృద్ధికి సంకేతం కాదు.. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణతోనే నిజమైన అభివృద్ధికి అర్థం. సిద్దాపూర్ ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు మా పోరాటం ఆగదు” అని బంజారా సేవాదళ్ నాయకులు స్పష్టం చేశారు.

**జాతీయ ఎస్టీ కమిషన్ జోక్యం చేసుకోవాలి**

సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ సమస్యపై సంబంధిత అధికారుల నుంచి పూర్తి వివరాలు సేకరించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, బాధిత ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్‌ను నాయకులు కోరారు. గిరిజనుల హక్కులు, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవాదళ్, ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షులు రాంబాల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, పాపయ్య, నరేందర్, తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తుల పరిశీలన

- రేపు సాయంత్రం (25 వ తేదీ) ఆన్ లైన్ లో అన్ని వివరాలు



**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 24:** ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన కొనసాగుతున్నదనీ, అందులో ప్రాథమికంగా అనర్హులుగా గుర్తించిన వారి నుంచి వచ్చిన అభ్యంతరాలను కూడా పరిశీలిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ శ్రీ విపి గౌతం తెలిపారు. ఈ ప్రక్రియ మంగళవారం సాయంత్రం వరకు కొనసాగుతుందనీ, ముందు ప్రకటించిన విధంగా 25 వ తేదీ సాయంత్రం వరకు అన్ని వివరాలు ఆన్ లైన్ లో వెల్లడిస్తామని పేర్కొన్నారు. అవుటర్ రింగ్ రోడ్ లోపలి వైపు ఉన్న 16 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజల నుంచి ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతాల్లోని ఇండ్ల కోసం 60,720 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమిక పరిశీలన అనంతరం అనర్హులుగా గుర్తించిన వారందరికి సమాచారం పంపించామని, 24వ తేదీ సాయంత్రం వరకు వారి నుంచి అభ్యంతరాలను స్వీకరించామన్నారు. ప్రధానంగా నగరంలో స్థిర నివాసం ఉండకపోవడం, ఇప్పటికే ఇండ్లు లేదా ఫ్లాట్ కలిగి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. దరఖాస్తుదారుల్లో ఫోర్ వీలర్స్ ఉండి వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్న వారిని అనర్హులుగా పరిగణించామని, క్యాబ్ లుగా వినియోగిస్తున్న దరఖాస్తు దారులను అర్హులుగా గుర్తిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనర్హులుగా గుర్తించిన వారి నుంచి వచ్చిన అభ్యంతరాలన్నిటినీ కూడా పరిశీలిస్తున్నామని, వాటన్నిటిని పరిష్కరించిన తరువాత అర్హులైన వారి తుది జాబితాను ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి అపోహలకు, అనుమానాలకు లోను కావద్దనీ ఆయన సూచించారు. దరఖాస్తు స్థితిగతులను తెలుసుకోడానికి ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగవద్దనీ, అన్ని వివరాలను వెబ్ సైట్ లో అందుబాటులో తెస్తామని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు దారులకు ఏమైనా సందేహాలుంటే, కాల్ సెంటర్ నెంబరు 04024603572లో సంప్రదించాలని సూచించారు.

# రాష్ట్రంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో గ్రామ/వార్డు సభల నిర్వహణ సంబంధిత ఎలక్టోరల్ రోల్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు




**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 24 :** డాక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి,ఐఏఎస్,అదనపు ముఖ్య ఎన్నికల అధికారి, జి.ఎస్. చారి, డిప్యూటీ సీఈఓ,కమిషనర్,జిహెచ్ఎంసి& జిల్లా ఎన్నికల అధికారి, హైదరాబాద్, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులుతో రాష్ట్రంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో గ్రామ/వార్డు సభల నిర్వహణ సంబంధిత ఎలక్టోరల్ రోల్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో సీఈవో డిఈఓ,ఈఆర్ఓస్ ఏఈఆర్ వోకు గ్రామ/వార్డు సభల ఏర్పాటు, నిర్వహణలో పాటించాల్సిన విషయాలు అలాగే ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ మరియు హియరింగ్‌ల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

**సీఈవో ఇచ్చిన ముఖ్య సూచనలు:**

గ్రామ/వార్డు సభల్లో ఓటర్ల వివరాలను సంబంధిత బిఎల్‌వోలు బహిరంగంగా చదివి వినిపించాలి. అలాగే, ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చబడిన ఓటర్ల పేర్లను కూడా సభలో చదివి వినిపించాలి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఏదైనా కారణంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చబడని దరఖాస్తుదారుల వివరాలను గుర్తించి, వాటిని పరిశీలించాలి.

01. నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసే అర్హత కలిగిన భారతీయ పౌరులు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేందుకు ఫామ్-6, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలి. ఓటర్ల పేర్ల తొలగింపులకు ఫామ్7, సవరణలకు ఫామ్-8 సంబంధిత ఆధార పత్రాలను సమర్పించే విధంగా ప్రజలకు సూచించాలి.

నిర్దేశించిన కాలంలో, భారత ఎన్నికల సంఘం ఈసీఐ నిర్దేశించిన అవసరమైన పత్రాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామ/వార్డు సభల్లో చర్చలు నిర్వహించాలి. ఓటర్ల జాబితా సర్ కు సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలను కూడా గ్రామ/వార్డు సభల్లో చర్చించాలి. వాటిని బిఎల్‌వోలు నోట్ చేసుకోవాలి. ఉన్న ఓటర్లకు నోటీసుల జనరేషన్ జారి ప్రక్రియను వేగవంతం చేయాలి.ప్రతి నోటీసు లోవివరాలను స్పష్టంగా,తప్పనిసరిగా పేర్కొనాలి. సంబంధించిన జాబితాలను బి ఎల్ ఓలు సంబంధిత రాజకీయ పార్టీలకు షేర్ చేయాలి. రాజకీయ పార్టీలతో సమన్వయం కోసంను ప్రతివారం తప్పనిసరిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. అనంతరం సీఈఓ అన్ని జిల్లాల డీఈవోలతో నోటీసుల జనరేషన్, జారి ప్రక్రియ, హియరింగ్‌ల నిర్వహణ మరియు గ్రామ/వార్డు సభల ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్ష చేశారు. గ్రామ/వార్డు సభలను పారదర్శకంగా మరియు సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ఓటర్లలో విశ్వాసాన్ని పెంపొందించి, ఎన్నికల ప్రక్రియపై మరింత విశ్వసనీయతను తీసుకురావాలని సీఈవో సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నోడల్ అధికారులు మరియు పాల్గొన్నారు.

# ప్రసవానంతరం మహిళలకు వచ్చే థైరాయిడ్ సమస్యలకు కారణాలేంటి.. జీవితాంతం ఉంటాయా..?



ప్రసవం తర్వాత మహిళల్లో శరీరంలో అనేక హార్మోన్ల, రోగనిరోధక వ్యవస్థ మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ సమయంలో థైరాయిడ్ పనితీరులో కూడా మార్పులు వస్తాయి. అయితే ప్రసవం తర్వాత థైరాయిడ్ సమస్య కనిపించిందంటే అది జీవితాంతం కొనసాగుతుందని భావించాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు.

**అందరికీ ఒకేలా ఉండవు..**

ప్రసవం తర్వాత థైరాయిడ్ సమస్యకు సంబంధించిన లక్షణాలు ఒకే విధంగా ఉండవు. సాధారణంగా ఇది వివిధ దశల్లో కనిపిస్తుంది. మొదటి దశలో థైరాయిడ్ హార్మోన్లు అధికంగా విడుదల అవుతాయి. ఈ సమయంలో మహిళలు అలసటగా ఉన్నప్పటికీ, అదే సమయంలో అసహనంగా లేదా అధిక ఉత్సాహంతో ఉన్నట్లుగా అనిపిస్తుంది. నిద్ర సరిగా పట్టకపోవడం, ఒత్తిడిగా అనిపించడం, జుట్టు రాలడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.

**టీపీవో యాంటీ బాడీలు..**

అయితే ప్రతి మహిళలో ఈ సమస్య జీవితాంతం కొనసాగదు. చాలా మందిలో మూడో దశలో థైరాయిడ్ పనితీరు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటుంది.

# ప్రచురణార్థం, ప్రసారార్థం



● దళిత క్రైస్తవుల ఐక్యత ఆత్మగౌరవం రాజ్యాధికార లక్ష్యంతో ముందుకు
● దళిత క్రైస్తవ హక్కుల సాధన జాతీయ ఉద్యమం ఉధృతం
● రాజ్యాంగ హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తేలేదు
● 26 నవంబర్ 2026 నుంచి బస్సు యాత్రకు సన్నాహాలు
● AIDCRPC సంస్థాగత నియామక కార్యక్రమంలో జాతీయ నేతలు

**ప్రెస్ క్లబ్ కడప:** అణగారిన దళితులు, దళిత క్రైస్తవులు, క్రైస్తవులు సహా ఇతర నూటికి 90 శాతం పైబడి వుంటున్న అణగారిన బలహీన సబ్బండ మెజారిటీ బహుజన మహాజన వర్గాల ఐక్యత ఆత్మగౌరవం సమానత్వం సమాన ప్రాతినిధ్యం స్వయం పాలన రాజ్యాధికార లక్ష్యంతో కలిసికట్టుగా సమిష్టిగా మరియు సంఘటితంగా ముందుకు సాగుదామని: ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ (AIDCRPC) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సంగటి చిన్నయోసేపు, మాజీ డిప్యూటీ కలెక్టర్, జాతీయ సలహా మండలి సమన్వయకర్త మారెల్ల మునిరాజ్, గౌరవాధ్యక్షులు, మహాజన రాజ్యం పార్టీ (MRP) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు సంగటి మనోహర్ మహాజన్ లు పిలుపునిచ్చారు. ఈమేరకు ఇందుకు సంబంధించి కడప నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో, AIDCRPC వివిధ స్థాయిల, హోదాల నియామకాల కార్యక్రమాన్ని సంగటి చిన్నయోసేపు అధ్యక్షతన చేపట్టారు. ఈ సందర్భంగా సంగటి చిన్నయోసేపు, మారెల్ల మునిరాజ్, సంగటి మనోహర్ మహాజన్ లు మాట్లాడుతూ.. దళిత క్రైస్తవ హక్కుల సాధన జాతీయ ఉద్యమాన్ని, దక్షిణభారతదేశం మొత్తం తీసుకెళ్లి పెద్దఎత్తున భారీఎత్తున ఉధృతం చేస్తామన్నారు. ఈ వర్గాల రాజ్యాంగ హక్కులు అవకాశాలు ప్రయోజనాల సాధన విషయంలో, రాజీలేని నిస్వార్థ నిజాయితీ నిష్పక్షపాత పారదర్శకత జవాబుదారీతనంతో కూడిన పోరాటం చేస్తామన్నారు. హక్కులు అడిగితే వచ్చేవికావని, పోరాటం ద్వారానే సాధించుకోబడతాయన్న విషయం తమకు బాగా తెలుసన్నారు. భారత రాజ్యాంగం ఆమోదం పొందిన వచ్చే 26 నవంబర్ నుంచి, అమలు పరిచిన 26 జనవరి వరకు దక్షిణ భారతదేశ వ్యాప్తంగా "దళిత క్రైస్తవ చైతన్య బస్సు యాత్ర" చేయాలని సంకల్పించామన్నారు. ఇదే విషయం సహా ఇతర అనేక తాజా అంశాలపై చర్చించేందుకు వచ్చే 29 ఆగస్టు 2026న శనివారం గుంటూరు కేంద్రంలో భారీ సదస్సును సైతం నిర్వహిస్తున్నామన్నారు.

**సంస్థాగత నియామకాలు:**

AIDCRPC సంస్థ రోజురోజులు అన్ని విభాగాలలో, స్థాయిల్లో బలోపేతం అయ్యేందుకు ఉద్దేశించి, సామాజిక, ఆధ్యాత్మిక విభాగపు జాతీయ సమన్వయకర్తగా, రెవరెండ్ డాక్టర్ అల్లూరి దేవన్న గారిని, పాస్టర్స్ అండ్ లీడర్స్ విభాగపు రాష్ట్ర సమన్వయకర్తగా రెవరెండ్ మద్దెల ఫిలిఫ్ గారిని, సామాజిక ఆధ్యాత్మిక విభాగపు రాష్ట్ర సమన్వయకర్తగా, రెవరెండ్ డాక్టర్ డి.వి. ప్రసాద్ గారిని, మహిళా జాతీయ విభాగపు అధ్యక్షురాలిగా, శ్రీమతి కొండా భార్గవి గారిని, రాష్ట్ర కార్యదర్శిగా శ్రీమతి మేరీ మంజుల గారిని నియయమించినట్లు జాతీయ ప్రచార సమన్వయకర్త సంగటి జాషువా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో AIDCRPC జాతీయ ఉపాధ్యక్షులు బండి నెల్సన్ విజయ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి కటారి ప్రసాద్, జాతీయ కోశాధికారి ఉప్పలపాటి జ్ఞానానందం, కేంద్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు మల్లేపల్లి శోభావిజయ సామ్రాజ్యలక్ష్మి సహా దక్షిణ భారతదేశ సమన్వయకర్త రెవరెండ్ నర్రా సుధీర్ కుమార్, న్యాయ సలహాదారు, హైకోర్టు న్యాయవాది షేక్ అమీన్ పీరాతో పాటు జిల్లా నాయకురాలు దరియ సునీత (అమ్ములు), ప్రత్యేక ఆహ్వానితురాలు వీ.ఖ. రత్నకుమారి, ఇల్లూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

**హృదయపూర్వక నమస్కారాలతో.....**

(సంగటి చిన్నయోసేపు)
వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు,
ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ (AIDCRPC);
ఆంధ్రప్రదేశ్ దక్షిణభారతదేశం ఇండియా – 9182361339

# ప్రజలను కాపాడుతాను..

## సుభిక్షంగా ఉండాలని అమ్మవారి ఆశీర్వచనం





**సికింద్రాబాద్: ఆగస్టు 23 (భవిష్యత్ ప్రజాపాలన న్యూస్):** బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని చాచా నెహ్రూనగర్‌లో కొలువైన శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో సోమవారం నిర్వహించిన రంగం కార్యక్రమంలో భవిష్యవాణి అమ్మవారు భక్తులకు ఆశీర్వచనం అందించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఏటా ఆషాఢ, శ్రావణ మాసాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న పూజలు తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, వ్యవసాయం సస్యశ్యామలంగా ఉంటుందని భవిష్యవాణి ద్వారా అమ్మవారు పేర్కొన్నారు. ధర్మబద్ధంగా జీవించే వారిని కాపాడుతానని, దుష్టులను శిక్షిస్తానని ఆశీర్వచనం ఇచ్చారు.

**జల్లికడవకు ప్రత్యేక పూజలు**

అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు జల్లికడవను టాకరా బస్తీలోని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ నివాసం నుంచి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వై. సురేష్‌కుమార్, ఎం.ప్రభాకర్, వి.ఎస్. నారాయణ, డి.శ్రీనివాస్ ముదిరాజ్, మురళీకృష్ణ, కుమార్‌తో పాటు బీజేపీ నాయకుడు వై.శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సీటుబెల్ట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవు



● రహదారి భద్రతపై శంకర్‌పల్లి పోలీసుల విస్తృత తనిఖీలు
● మద్యం సేవించి డ్రైవింగ్, రాంగ్‌రూట్, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్‌పై పోలీసుల హెచ్చరిక

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । ఆగస్టు 24 । చేవెళ్ల నియోజకవర్గం :** వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం సాగించాలని శంకర్‌పల్లి పోలీసులు సూచించారు. సోమవారం పట్టణ పరిధిలోని బీడీఎల్ క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. కార్లు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీటుబెల్ట్ ధరించాలని పోలీసులు స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడటం వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడవద్దని హెచ్చరించారు. వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుని విలువైన ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ తనిఖీల కార్యక్రమంలో ఏఎస్ఐలు కాటంరాజు, చంద్రకళ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకొని తిరిగి వచ్చిన సీఎంకు రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు





**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 24:** సత్కారంవిదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు.

# రజక సంఘం బోనాల ఉత్సవానికి ఆహ్వానం



● నర్ర బిక్షపతి పటేల్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

**పటాన్‌చెరు, ఆగస్టు 24:** పటాన్‌చెరు రజక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30న బోనాలు, ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను రజక సంఘం పెద్దలు నర్ర బిక్షపతి పటేల్‌కు ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా నర్ర బిక్షపతి పటేల్ మాట్లాడుతూ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోనాల ఉత్సవం, ఫలహారం బండి ఊరేగింపును విజయవంతం చేయాలని కోరారు. బోనాల పండుగ మన సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ నెల 30న జరిగే బోనాల కార్యక్రమానికి భక్తులు, రజక సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు సంఘం పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు.

# కొండాపూర్‌లో దారుణం

## అక్రమ భవనం కూలి ఇద్దరు కార్మికుల దుర్మరణం



● శంషాబాద్‌లో ప్రధాన నిందితుడి అరెస్ట్.. పరారీలో కాంట్రాక్టర్?

**హైదరాబాద్ (తెలుగు వార్తలు):** కొండాపూర్ అంజయ్య నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఆరంతస్తుల (G+6) భవనం ఉన్నపళంగా కూలిపోయిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో భవన శిథిలాల కింద చిక్కుకుని ఇద్దరు పశ్చిమ మధ్యప్రదేశ్ కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదుతో రాయదుర్గం పోలీసులు వేగంగా స్పందించి ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేశారు.

**ఉలిక్కిపడ్డ అంజయ్య నగర్**

ఈ నెల 22న మధ్యాహ్నం 1:00 గంటల సమయంలో భవనంలో టైల్స్ పనులు జరుగుతుండగా ఒక్కసారిగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో టైల్స్ లేబర్లుగా పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఉమేష్ కాలే (45), ముహపాల్ భలావి (46) శిథిలాల కింద నలిగిపోయి మృతి చెందారు. భవనం పక్కనే ఉన్న జయదర్శిని రెసిడెన్సీపై పడటంతో జ-బ్లాక్ తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనలో 75 ఏళ్ల కె.వి. రమణారెడ్డితో పాటు మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో కేసు (Cr.No: 945/2026, U/s 105 r/w 3(5) BNS) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు దిగ్భ్రాంతికర విషయాలు తెలిశాయి. మున్సిపల్ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, కనీస సెట్‌బ్యాక్‌లు వదలకుండా నిందితుడు సయ్యద్ సజీద్ కాంట్రాక్టర్ ఖాజా మొయినుద్దీన్‌తో కలిసి నాసిరకం మెటీరియల్‌తో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తేలింది.

**శంషాబాద్‌లో నిందితుడి నాటకీయ అరెస్ట్**

కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ రెడ్డి, డీసీపీ రీతిరాజ్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. దేశం విడిచి పారిపోవడానికి యత్నిస్తున్న ప్రధాన నిందితుడు సయ్యద్ సజీద్‌ను శంషాబాద్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న కాంట్రాక్టర్ ఖాజా మొయినుద్దీన్ కోసం గాలింపు చర్యలు తీవ్రతరం చేశారు. మృతదేహాలకు ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



● శ్రావణమాసం రెండో సోమవారం ప్రత్యేక అభిషేకం.. భక్తులకు అన్నదానం
● అన్నదాన దాతను ఘనంగా సత్కరించిన ఆలయ నిర్వాహకులు

**భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి । ఆగస్టు 24 । చేవెళ్ల నియోజకవర్గం :** శంకర్‌పల్లి పురపాలక సంఘం పరిధిలోని చిన్నశంకర్‌పల్లి శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో శ్రావణమాసం రెండో సోమవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదో వార్డు కౌన్సిలర్ భానూరి కృష్ణ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ ఉషా విజయ్ కుమార్, ఆలయ నిర్వాహకులు కలిసి అన్నదాన దాతను స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు శ్రీకాంత్ గౌడ్, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకే కుటుంబం..

## గంటల వ్యవధిలో నలుగురు మృతి





● తల్లి మృతి వార్తతో బయలుదేరి.. ఇద్దరు దుర్మరణం

**అచ్చంపేట: భవిష్యత్ ప్రజాపాలన జర్నలిస్టు జలగం సురేందర్:** లింగాల మండలం రాయవరం గ్రామంలో విషాదఛాయలు తల్లి గుండెపోటుతో మృతి చెందిందన్న విషాద వార్తతో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరిన కుటుంబ సభ్యులను రోడ్డు ప్రమాదం రూపంలో మరో పెను విషాదం వెంటాడింది. తల్లి అంత్యక్రియలకు బయలుదేరిన కుమారుడు, కోడలు, అల్లుడు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో కోడలు, అల్లుడు మృతి చెందగా, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఒకే కుటుంబంలో కొద్ది వ్యవధిలోనే నలుగురిని కోల్పోయిన విషాదం నెలకొంది. పూర్తి వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన లలితమ్మ అంగన్వాడీ టీచర్‌గా విధులు నిర్వహించారు. సోమవారం అచ్చంపేట పట్టణంలోని తన నివాసంలో ఆమె గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం హైదరాబాద్లో ఉన్న ఆమె కుమారుడు శ్రీకాంత్ కు తెలియడంతో భార్య చంద్రకళ (29), అల్లుడు నాగరాజు (25)తో కలిసి స్వగ్రామానికి బయలుదేరారు.

**డిండి వద్ద ఘోర ప్రమాదం..**

శ్రీకాంత్, చంద్రకళ, నాగరాజు బైక్ పై స్వగ్రామానికి వెళ్తుండగా నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో ఎదురుగా వచ్చిన కారు వారి బైక్ను ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో చంద్రకళ, నాగరాజు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీకాంత్ కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్లో శ్రీకాంత్ కు మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు కు తరలించారు. ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లి మృతితో ప్రారంభమైన విషాదం.. రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరి ప్రాణాలను బలిగొనడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడు నాగరాజు స్వగ్రామం ఆంధ్రప్రదేశ్లోని నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం చిన్నరాజుపాలెం గ్రామమని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888

# పాటిగడ్డలో 'త్రీ స్టార్' వర్క్‌షాప్ హల్‌చల్!

- **రోడ్డే పార్కింగ్.. కార్మికుల భద్రతపై ప్రశ్నలు**
- **అనుమతులు, లైసెన్సులపై అధికారుల తనిఖీ ఎప్పుడు? స్థానికుల ఆవేదన**

**సికింద్రాబాద్, ఆగస్టు 24 (భవిష్యత్తు ప్రజా పాలన న్యూస్)** వర్క్‌షాప్ నిర్వహణ పేరుతో ప్రధాన రహదారినే పార్కింగ్ స్థలంగా మార్చేస్తే ఎలా? ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు? కార్మికుల భద్రత, సంక్షేమానికి సంబంధించిన నిబంధనలు అమలవుతున్నాయా? వర్క్‌షాప్ నిర్వహణకు అవసరమైన అనుమతులన్నీ ఉన్నాయా? ప్రస్తుతం పాటిగడ్డ ప్రాంతంలో 'త్రీ స్టార్ వర్క్‌షాప్' వ్యవహారంపై స్థానికుల్లో ఇలాంటి ప్రశ్నలే వినిపిస్తున్నాయి.

బేగంపేట్ డివిజన్ పరిధిలోని పాటిగడ్డలో నిర్వహిస్తున్న త్రీ స్టార్ వర్క్‌షాప్ కారణంగా ప్రధాన రహదారిపై తరచూ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్క్‌షాప్‌కు వచ్చే వాహనాలను ప్రాంగణంలో కాకుండా రహదారి పక్కన, ప్రధాన మార్గంలో నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని చెబుతున్నారు.

**అనుమతులపై స్పష్టత ఏది**

వర్క్‌షాప్ నిర్వహణకు సంబంధించి అవసరమైన స్థానిక సంస్థ అనుమతులు, ట్రేడ్ లైసెన్స్, భవన వినియోగానికి సంబంధించిన అనుమతులు, అగ్నిమాపక భద్రతా నిబంధనలు వర్తిస్తే వాటి అనుసరణ, వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు తదితర అంశాలను సంబంధిత శాఖలు పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. వర్క్‌షాప్ నిర్వహిస్తున్న ప్రాంగణం వినియోగం, పార్కింగ్ ఏర్పాట్లు, రహదారిపై వాహనాల నిలుపుదల వంటి అంశాలపైనా అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**కార్మికుల భద్రత సంగతేంటి?**

వాహనాల మరమ్మతులు, వెల్డింగ్, పెయింటింగ్, యంత్రాల వినియోగం వంటి పనులు జరిగే వర్క్‌షాప్‌లలో కార్మికుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. పనిచేసే సిబ్బందికి అవసరమైన వ్యక్తిగత రక్షణ పరికరాలు, అగ్నిప్రమాద నివారణ ఏర్పాట్లు, అత్యవసర పరిస్థితుల్లో భద్రతా చర్యలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలాగే అర్హత కలిగిన ఉద్యోగులకు వర్తించే ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సామాజిక భద్రతా సౌకర్యాలు నిబంధనల ప్రకారం అందుతున్నాయా? కార్మికుల వివరాలు, వేతనాలు, ఉద్యోగ నిబంధనలు చట్టప్రకారం నిర్వహిస్తున్నారా?అన్న అంశాలను సంబంధిత కార్మిక శాఖ అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

**రహదారిపైనే వాహనాల బారులు**

వర్క్‌షాప్‌కు మరమ్మతుల కోసం వచ్చే వాహనాలను ప్రధానరహదారిపై నిలిపివేయడం వల్ల రహదారి వెడల్పు తగ్గిపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పాదచారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో ప్రమాదాల ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు ఎందుకు స్పందించడం లేదు?**

ప్రధాన రహదారిపై పార్కింగ్ జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నప్పటికీ సంబంధిత జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వర్క్‌షాప్‌కు సంబంధించిన అనుమతులు, పార్కింగ్ ఏర్పాట్లు, కార్మికుల భద్రత, పర్యావరణ నిబంధనలు తదితర అంశాలపై ఇప్పటివరకు తనిఖీలు జరిగాయా? జరిగితే ఏం తేలింది? అనే విషయాలను అధికారులు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, వర్క్‌షాప్ యాజమాన్యం స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

**ఏయే అనుమతులు పరిశీలించాలి?**

త్రీ స్టార్ వర్క్‌షాప్‌కు వర్తించే చట్టాలు, కార్యకలాపాల స్వభావం, ప్రాంగణం, ఉద్యోగుల సంఖ్య, పెయింటింగ్/వెల్డింగ్ వంటి కార్యకలాపాలపై ఆధారపడి సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు మారవచ్చు. అందువల్ల అధికారులు ప్రధానంగా ఈ అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది.

**స్థానిక సంస్థ/జీహెచ్ఎంసీ నుంచి అవసరమైన ట్రేడ్ లైసెన్స్ ఉందా?**

భవనం, ప్రాంగణాన్ని వర్క్‌షాప్ కార్యకలాపాలకు వినియోగించేందుకు భవన వినియోగం/ప్లానింగ్ అనుమతులు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? కార్యకలాపాలకు అగ్నిమాపక భద్రతా నిబంధనలు వర్తిస్తే అవసరమైన అనుమతులు, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు ఉన్నాయా? ఉద్యోగుల సంఖ్య, పని స్వభావం ఆధారంగా ఈఎస్ఐ, పీఎఫ్/ఈపీఎఫ్ వంటి సామాజిక భద్రతా నిబంధనలు అమలవుతున్నాయా? వర్తించే కార్మిక చట్టాలు, వర్క్‌ప్లేస్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా? పెయింటింగ్, ఆయిల్, గ్రీస్, బ్యాటరీలు, ఇతర ప్రమాదకర/వ్యర్థ పదార్థాల నిర్వహణకు వర్తించే పర్యావరణ నిబంధనలు పాటిస్తున్నారా? వర్క్‌షాప్ కార్యకలాపాల వల్ల రహదారి, ప్రజా రవాణాకు ఇబ్బంది కలగకుండా వాహనాల పార్కింగ్‌కు తగిన ప్రాంగణం ఉందా? ప్రధాన రహదారిపై వాహనాలను నిలిపివేస్తున్నారా? అలా చేస్తే ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన జరుగుతోందా? షాప్ నిర్వహణకు అవసరమైన ఇతర శాఖల అనుమతులు కార్యకలాపాల స్వభావాన్ని బట్టి తీసుకున్నారా?

**సమగ్ర తనిఖీ చేయాలి**

త్రీ స్టార్ వర్క్‌షాప్‌పై జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు, కార్మిక శాఖ, అగ్నిమాపక శాఖ, పర్యావరణ శాఖ తదితర సంబంధిత అధికారులు తమ పరిధిలో సమన్వయంతో తనిఖీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రధాన రహదారిపై పార్కింగ్‌ను అరికట్టి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రజా రహదారి ఎవరి సొంతం కాదు.. నిబంధనలు అందరికీ సమానమే. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని పాటిగడ్డ వాసులు కోరుతున్నారు.

# తెలంగాణ ప్రయోజనాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి గళం

- **అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరణపై తీవ్ర అభ్యంతరం**
- **సీఎం నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్**



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన స్వరం వినిపించారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ నవీన్ యాదవ్ అన్నారు. అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి నవీన్ యాదవ్ పాల్గొన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు, యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**పెట్టుబడుల కోసం పర్యటన.. రాజకీయ అడ్డంకులా?**

'తెలంగాణ రైజింగ్--2047' దార్శనికతలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడం, కొత్త పరిశ్రమలను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను పెంచడం లక్ష్యంగా అమెరికా పర్యటనను చేపట్టినట్లు తెలిపారు. అయితే ముఖ్యమంత్రి పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే చర్యగా అభివర్ణించారు. తెలంగాణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు వెళ్లడాన్ని రాజకీయ కారణాలతో అడ్డుకోవడం తెలంగాణ పట్ల వివక్ష చూపడమేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేసినట్లు నవీన్ యాదవ్ తెలిపారు.



**రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యం**

తెలంగాణకు పెట్టుబడులు రావడం, పరిశ్రమలు ఏర్పాటు కావడం, యువతకు ఉద్యోగ అవకాశాలు లభించడం రాజకీయాలకు అతీతమైన అంశాలని నవీన్ యాదవ్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తెలంగాణ హక్కులు, ప్రయోజనాల విషయంలో రాజీపడకుండా రాష్ట్రం తరపున బలమైన స్వరం వినిపిస్తామని, అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పనలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి కొనసాగుతుందని నవీన్ యాదవ్ పేర్కొన్నారు.

# హెచ్1ఎన్1 నుంచి కోలుకున్న తరువాత కనిపించే సమస్యలు ఇవే.. నిపుణులు ఏం చెబుతున్నారంటే..

హెచ్1ఎన్1 (H1N1) వంటి ఫ్లూ నుంచి కోలుకున్న తర్వాత జ్వరం, దగ్గు, ఒంటి నొప్పులు తగ్గిపోయినా కొందరిలో అలసట, ఏకాగ్రత లోపం, విషయాలను గుర్తు చేసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు కొంతకాలం కొనసాగుతాయి. దీనినే సాధారణంగా బ్రెయిన్ ఫాగ్ గా పేర్కొంటారు. ఆలోచన నెమ్మదించడం, సమాచారాన్ని అర్థం చేసుకోవడానికి ఎక్కువ సమయం పట్టడం, ఏకాగ్రత నిలబెట్టుకోలేకపోవడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఈ సమస్య సాధారణంగా తాత్కాలికమేనని, శరీరం పూర్తిగా కోలుకున్న కొద్దీ తగ్గే అవకాశం ఉందని నిపుణుల అభిప్రాయం. హెచ్1ఎన్1 ఇన్ఫెక్షన్ సమయంలో వైరస్‌తో పోరాడేందుకు శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. ఈ ప్రక్రియలో విడుదలయ్యే ఇన్‌ఫ్లమేటరీ రసాయనాలు కొంతకాలం మెదడు సాధారణ పనితీరుపై ప్రభావం చూపిస్తాయి. దీంతో ఇన్ఫెక్షన్ తగ్గిపోయిన తర్వాత కూడా అలసట, ఆలోచన నెమ్మదించడం, ఏకాగ్రత తగ్గడం లేదా విషయాలను గుర్తు చేసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన హెచ్1ఎన్1 ఇన్ఫెక్షన్‌లో శరీరంలో ఎక్కువ వాపు, ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం లేదా ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి ఏర్పడితే ఈ సమస్యలు మరింత స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుంది.?

**కారణాలేంటి..**

అయితే బ్రెయిన్ ఫాగ్‌కు ఇన్‌ఫ్లమేషన్ ఒక్కటే కారణం కాదు. అనారోగ్య సమయంలో సరిగ్గా నిద్రపట్టకపోవడం కూడా ఏకాగ్రత, జ్ఞాపకశక్తిపైప్రభావం చూపుతుంది.జ్వరం,నిరంతర దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, రోజువారీ జీవనశైలిలో మార్పుల కారణంగా ప్రశాంతమైన నిద్రకు అంతరాయం కలుగుతుంది.

# ఘనంగా మర్రి శశిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు








- **బేగంపేట్ బీజేపీ కార్యాలయంలో అభిమానులు, నాయకులు, కార్యకర్తల సందడి**

**సికింద్రాబాద్, ఆగస్టు 24 (భవిష్యత్ ప్రజాపాలనా న్యూస్):** బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, ఎన్డీఎంఏ మాజీ వైస్ చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి 77వ జన్మదిన వేడుకలు బేగంపేట్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. నాయకులు, కార్యకర్తలు శశిధర్‌రెడ్డి గారిని ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ సీనియర్ నాయకులతో పాటు డివిజన్ స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. తమ అభిమాన నాయకుడి జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం పట్ల కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మర్రి శశిధర్‌రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ తనదైన శైలిలో సేవలందిస్తున్నారని కొనియాడారు. ఆయనకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించి మరింత కాలం ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు. అభిమానుల నడుమ.. ఆత్మీయ శుభాకాంక్షల మధ్య జరిగిన ఈ జన్మదిన వేడుకలు బేగంపేట్‌లో సందడిగా సాగాయి.



# 'మిషన్ 40'.. చివరికి 17! రేవంత్ బలం ఇంతేనా?

- **సొంత ఎమ్మెల్యేలే సీఎం వెంట నిలబడలేదు.. కాంగ్రెస్‌లో కుమ్ములాటలు బట్టబయలు**
- **'వలస' నేతలకు పెద్దపీట.. సీనియర్లకు మొండిచేయి: మన్నె గోవర్ధన్‌రెడ్డి**

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంపై సొంత పార్టీ ఎమ్మెల్యేలకే నమ్మకం సన్నగిల్లిందని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లి'మిషన్ 40.. ఫలితం 17'లిగా మారిన బలప్రదర్శనతో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయని ఎద్దేవా చేశారు.

**66 మంది ఎమ్మెల్యేలు.. సీఎం తరపున మాట్లాడింది కొద్దిమందే!**

కాంగ్రెస్‌కు 66 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి తరపున మాట్లాడేందుకు కొద్దిమంది మాత్రమే ముందుకు రావడం ఆయన నాయకత్వ పరిస్థితికి అద్దం పడుతోందని మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సొంత ఎమ్మెల్యేలనే తన వెంట నడిపించుకోలేని సీఎం.. రాష్ట్రాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తారని ప్రశ్నించారు.

**కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు**

సీనియర్, అసలైన కాంగ్రెస్ నాయకులను పక్కనపెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చిన వలస నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారనే అసంతృప్తి పార్టీలో తీవ్రంగా ఉందని ఆరోపించారు. దీంతో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయని పేర్కొన్నారు.

**ప్రజా సమస్యలు పక్కన.. కుర్చీల కోసం కుమ్ములాట!**

ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలి పదవులు, కుర్చీల కోసం అంతర్గత రాజకీయాలకు పరిమితమైందని మన్నె గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందా? లేక కాంగ్రెస్‌లోని నేతల కుర్చీల కోసం పనిచేస్తుందా? అని నిలదీశారు.

**'సొంతవారినే నమ్మించలేని సీఎం.. ప్రజలను ఎలా నమ్మిస్తారు?'**

"సొంత ఎమ్మెల్యేల విశ్వాసమే కోల్పోయిన సీఎం రేవంత్‌రెడ్డి ఇక ప్రజల విశ్వాసాన్ని ఎలా గెలుచుకుంటారు?" అని మన్నె గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. 'మిషన్ 40' అంటూ బలప్రదర్శనకు దిగితే.. చివరకు 17 మంది మాత్రమే కనిపించడం కాంగ్రెస్‌లోని వాస్తవ పరిస్థితికి నిదర్శనం అని అన్నారు. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు తారస్థాయికి చేరాయని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని మన్నె గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యలను విస్మరించి పదవుల కోసం పోరాడుతున్న కాంగ్రెస్‌కు ప్రజలే తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.




# హైదరాబాద్‌లో ఏవమ్ హెల్త్ కేర్ హబ్ ప్రారంభం




- **ప్రివెంటివ్ కేర్, లాంగెవిటీ మెడిసిన్‌తో ఆరోగ్యకరమైన జీవనంపై దృష్టి**

**ఖైరతాబాద్, ఆగస్టు 24 (భవిష్యత్ ప్రజాపాలన):** తెలంగాణ రాష్ట్రంతో పాటు హైదరాబాద్ నగర ప్రజలకు ఆధునిక, నూతన చికిత్సా విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చిన 'ఆవమ్ హెల్త్ కేర్ హబ్' (ూాజుఎఖవీ ఎముశ్రీష్ట ఎబఎ)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య నిపుణులు, రాజకీయ, సినీ ప్రముఖులు సూచించారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లో ఏర్పాటు చేసిన ఏవమ్ హెల్త్ కేర్ హబ్‌ను ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు కుటుంబ సమేతంగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే, ముందుగానే వ్యాధులను గుర్తించి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని సూచించారు. ప్రివెంటివ్ కేర్, లాంగెవిటీ మెడిసిన్ ద్వారా ఆరోగ్యకరమైన, దీర్ఘాయుష్షుతో కూడిన జీవనాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా హెల్త్ హబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం మెట్రో నగర జీవన విధానంలో సమయపాలన లోపించడం, సరైన ఆహారం తీసుకోకపోవడం, నిద్రలేమి తదితర కారణాలతో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని సంస్థ వ్యవస్థాపకురాలు, సీఈఓ డాక్టర్ మహతీ రెడ్డి తెలిపారు. ప్రజల ఆరోగ్య సమస్యలకు సమగ్ర పరిష్కారం అందించే లి'వన్ స్టాప్ హెల్త్ హబ్'లిగా ఏవమ్ హెల్త్ కేర్ హబ్ పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైద్య బృందానికి చెందిన డా. నివేదిత రెడ్డి, డా. డి.ఎన్. రెడ్డి, డా. భామిని సుధీర్, డా. సందీప్ రెడ్డి, డా. సౌమ్య రెడ్డి, డా. పవని రవి, డా. రాధా బర్చ్, డా. సుమన మూలే, మాధురి రాచపల్లి, రూపా పింగ్లే తదితరులతో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



## బాలు ఫోర్ ఇండస్ట్రీస్ లాభం 15 శాతం పెంపు

- **జూన్ క్యూ1లో రూ.66 కోట్లు**

**ఖైరతాబాద్, ఆగస్టు 24(భవిష్యత్ ప్రజాపాలన):** ప్రైమరీ ఇండస్ట్రీస్‌కు చెందిన బాలు ఫోర్ ఇండస్ట్రీస్ ఆదాయం జూన్ క్వార్టర్‌లో 29 శాతం పెరిగి రూ. 300.7 కోట్లకు చేరుకుంది. ఇదే సమయంలో 17.3 శాతం వృద్ధితో రూ. 84.8 కోట్లకు చేరింది. లాభం 15.9 శాతం పెరిగి రూ. 66.1 కోట్లుగా నమోదైంది. కంపెనీ సీఈఓ సింగ్ ఈ ఫలితాలపై హర్షం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి తొలి ఎలక్ట్రిక్ స్కూటర్ అందించడం తమ ప్రయాణంలో మైలురాయిగా నిలిచిందని తెలిపారు. రక్షణ రంగంలో భారీ ఆర్డర్లతో పాటు సాయుధ వాహనాల విభాగంలో తమ సంస్థ దూసుకెళ్తోందని పేర్కొన్నారు. అదనంగా తయారీ సామర్థ్యాలను మరింత విస్తరించి గ్లోబల్ మార్కెట్లలో బలమైన స్థానాన్ని దక్కించుకోవాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు.

## లంచం వలలో రెవెన్యూ అధికారులు!



- **విరాసత్ కోసం (పాతి) రూ.14 వేలు డిమాండ్.. ఏసీబీకి చిక్కిన జీపీవో, ఆర్ఐ**

**ఆలేరు:** భూమి విరాసత్ ప్రక్రియలో సహకరించేందుకు రైతు నుంచి రూ. 14 వేల లంచం తీసుకుంటూ ఆలేరు తహసీల్దార్ కార్యాలయానికి చెందిన జీపీవో షేక్ హమ్మద్, ఆర్ఐ వేముగంటి పూర్ణచందర్‌రావు ఏసీబీకి పట్టుబడ్డారు. సోమవారం జరిగిన ఈ ఘటన రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపింది. యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బుడిగే మహేష్‌కు కొలనుపాక రెవెన్యూ శివారులో కుటుంబానికి చెందిన 8.5 ఎకరాల భూమి ఉంది. ఇందులో 4.5 ఎకరాలు మహేష్‌కు, మరో 2 ఎకరాలను ఆయన అక్కకు తండ్రి బుడిగే ఉప్పలయ్య గతంలో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం తండ్రి మృతి చెందడంతో మిగిలిన భూమిని అక్కకు విరాసత్ చేయాలని మహేష్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. ఈ వ్యవహారంలో ఫీల్డ్ విచారణ చేయాల్సి ఉంటుందని అధికారులు చెప్పడంతో మహేష్ ఆర్ఐ పూర్ణచందర్‌రావును సంప్రదించాడు. జీపీవో హమ్మద్‌ను కలవాలని ఆర్ఐ సూచించినట్లు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. జీపీవో రూ. 10 వేలు ఖర్చవుతుందని చెప్పగా, ఆర్ఐ మొత్తం రూ. 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అంత మొత్తం ఇవ్వలేనని మహేష్ చెప్పడంతో చివరకు రూ. 14 వేలకు ఒప్పందం కుదిరినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దీంతో మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు సోమవారం జీపీవో హమ్మద్‌కు రూ. 14 వేల నగదు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం జీపీవోతో పాటు ఆర్ఐను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

**లంచం డిమాండ్‌పై ఫిర్యాదు..**
**నగదు అందజేస్తుండగా పట్టివేత**

రెవెన్యూ కార్యాలయంలో భూ సంబంధిత పనులకు లంచం డిమాండ్ చేసిన వ్యవహారంపై ఏసీబీ అధికారులు దృష్టి సారించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పక్కా ప్రణాళికతో దాడి నిర్వహించి ఇద్దరు అధికారులను పట్టుకున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## రూపరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన



**డా.ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్**

**దేవరకొండ భవిష్యత్ ప్రజాపాలన ప్రతినిధి తిరుపతి వద్య్ :** ఇటీవల మృతి చెందిన కొండమల్లేపల్లి నాగార్జున స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ రూప రెడ్డి కుటుంబ సభ్యులను ఈరోజు హైదరాబాద్, గుర్రంగూడలోని నివాసాంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ హత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం ఆర్ఎస్పి గారు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంత దారుణంగా దిగజారాయో అని ఇలాంటి సంఘటనను చూస్తే అర్థమవుతుంది విద్యార్థులను మంచి మార్గంలో నడిపించడానికి ప్రతి స్కూల్లో ఒక కౌన్సిలర్ నియమించాలని అదేవిధంగా తల్లిదండ్రులకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, విద్యార్థుల నడవడికను గమనిస్తూ ఎప్పటికప్పుడు వారి ప్రవర్తన మీద దృష్టి పెట్టాలని సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా ఇలాంటి వాటికి తావునీవకుండ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం రూపరెడ్డి చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. వారి వెంట బిఆర్ఎస్ నాయకులు రామావత్ రమేష్ నాయక్, నాయిని శ్రావణ్ రెడ్డి, చనగొని శివ గౌడ్, తుర్కయంజాల్ కౌన్సిలర్ రామావత్ కళ్యాణ్ నాయక్, బండ రావిరాళ్ల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, అనాజ్ పూర్ సర్పంచ్ ముదిగొండ మొగులయ్య, కేశవులుఅందొజు శంకరాచారి, మల్లారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ భాస్కర్,గంటేల ఆంజనేయులు,గండు నాగేంద్రబాబు, ముదిగొండ వెంకట్, అశోక్ నాయక్,శ్రీను, శివ, అడ్వకేట్ మాతంగి సురేష్, పల్లె అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణిని కాపాడుకుంటూ.. లాభాల బాటలో నడిపిస్తాం



- **బిఎస్ఎన్ఎల్‌లా మారకుండా సింగరేణికి ఉజ్వల భవిష్యత్తు కై క్రిటికల్ మినరల్స్ వైపు అడుగులు!**
- **బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, లిథియం మైనింగ్‌లోకి సింగరేణి**
- **ఎన్‌టీపీసీ స్థాయిలో సింగరేణిని నిలబెట్టడమే మా ప్రభుత్వ ధ్యేయం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **భట్టి విక్రమార్క సమర్థవంతమైన నాయకత్వంలో సింగరేణి మరింత బలోపేతం అవుతుంది: మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి.**
- **సింగరేణి ఉజ్వల భవిష్యత్ కోసం పాటుపడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని సన్మానించిన సింగరేణి యూనియన్ నాయకులు**
- **తెలంగాణ రాష్ట్రానికి ఆత్మ లాంటి అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు కూడా లాభదాయక సంస్థగా అందించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు.**

**హైదరాబాద్ భవిష్యత్ ప్రజాపాలన సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ మొకిరాల ఉద్రాసీన్ ఆగస్టు 24:** సింగరేణి ఉజ్వల భవిష్యత్ కోసం దిశా నిర్దేశం చేస్తూ కంపెనీ మనుగడకు కీలకమైన బొగ్గు బ్లాక్‌లు సాధించడంలో సంపూర్ణ సహకారం అందిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లుకు సింగరేణిలోని గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాక్‌లను తీసుకోకపోవడం, ఉన్న గనులను మూసివేయడం వల్ల సింగరేణికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఐదారు సంవత్సరాల్లో సంస్థ మూతపడే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులు గట్టి పట్టుదలతో నైని కోల్ బ్లాక్‌ను సాధించామని చెప్పారు. 2013లో యూపీఏ ప్రభుత్వం సింగరేణికి రీ-అసైన్ చేసిన తాడిచర్ల-2 కోల్ బ్లాక్ విషయాన్ని కేంద్రంతో మాట్లాడి మైనింగ్ లీజు దక్కించుకోవడంలో ప్రభుత్వం సఫలమైందని తెలిపారు. అంతేకాకుండా జెన్కోను ఒప్పించి, సింగరేణికి వేలంలో మణుగూరు డిప్ సైడ్ బ్లాక్ -2 దక్కేలా కృషి చేశామన్నారు. ఒడిశాలోని 'నైనీ' బ్లాక్ సమస్యల పరిష్కారానికి స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి మార్గం సుగమం చేశామని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి వస్తుండటంతో భవిష్యత్తులో థర్మల్ పవర్ డిమాండ్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం బొగ్గుపైనే ఆధారపడితే సింగరేణి కూడా ఒకప్పటి లా వెనుకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే ప్రపంచ మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి 'క్రిటికల్ మినరల్స్' (కీలక ఖనిజాలు) మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు సౌత్ ఆఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి దేశాల కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించామని డిప్యూటీ సీఎం చెప్పారు. ఇప్పటికే కర్ణాటకలోని ఒక గోల్డ్ మైన్ వేలంలో పాల్గొని సాధించామని, ఆ గని ద్వారా భవిష్యత్ లో అక్కడ మైనింగ్ చేస్తే సింగరేణికి నిరంతరం రాయల్టీ లేదా ఆదాయం వస్తుందన్నారు. ప్రస్తుతం సింగరేణిలో 43,000 నుండి 45,000 మంది శాశ్వత ఉద్యోగులు, మరో 30,000 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా సరే మైనింగ్ బ్లాక్‌లను దక్కించుకునేలా ముందుకు వెళ్లాలన్నారు. 100 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న సింగరేణి సంస్థను అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ సంస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ సమష్టిగా పనిచేసి కంపెనీని ఉన్నతస్థాయిలో నిలపడానికి సహకరించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమర్థవంతమైన, డైనమిక్ నాయకత్వంలో సింగరేణి సంస్థ కొత్త గనుల ప్రారంభం, వ్యాపార విస్తరణ మరియు నూతన ప్రాజెక్టులతో శరవేగంగా ముందుకు సాగుతోందని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కొనియాడారు. భవిష్యత్తులో సింగరేణిని దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. సింగరేణి గొప్పతనాన్ని ఎన్నో వేదికలపై ప్రశంసించానని ఆయన గుర్తుచేసుకున్నారు. సింగరేణి మనమందరం గర్వపడాల్సిన ప్రతిష్టాత్మకమైన సంస్థ అని అభివర్ణించారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీ వాసిరెడ్డి, ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ శ్రీ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీ లక్ష్మీపతి గౌడ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కోసం అతికీలకమైన నైనీ బొగ్గు బ్లాక్ సాధన కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క స్వయంగా ఒడిశా వెళ్లి అక్కడ ముఖ్యమంత్రిని, స్థానిక ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలిసి వారందరినీ ఒప్పించి అన్ని అనుమతులు సాధించారని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా గత ఏడాది నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైందని, రాష్ట్ర ఇంధన అవసరాల కోసం ఈ నెలలో తొలి బొగ్గు రేకును సింగరేణికి కూడా రవాణా చేయడం సాధ్యమైందన్నారు. అదే సమయంలో 2013లో యూపీఏ ప్రభుత్వ కేటాయించిన తాడిచెర్ల -2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించడంలోనూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కృషి చేశారని ప్రశంసించారు. అదే సమయంలో బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా గత బీఆర్ఎస్ పాలకులు సింగరేణిని అడ్డుకోవడం వల్ల కంపెనీ మనుగడకు కీలకమైన రెండు కీలక గనులను సంస్థ చేజార్చుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో సింగరేణిలో బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనడానికి సింగరేణికి అనుమతి ఇవ్వడం వల్ల ఇటీవలే మణుగూరు డిప్‌సైడ్ -2 బ్లాక్‌ను సింగరేణి చేజిక్కించుకుందని వారు వివరించారు. బొగ్గు ఉత్పత్తికి పరిమితమైన సింగరేణి సంస్థను కీలక ఖనిజ రంగం వైపు తీసుకెళ్తు అంతర్జాతీయ సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళు న్నారని పేర్కొన్నారు. కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజ అన్వేషణ లైసెన్స్ కూడా సింగరేణి దక్కించుకోవడంలో ప్రజా ప్రభుత్వంలో సింగరేణి సాధించిన మరో విజయమన్నారు. అదే సమయంలో కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ పంపిణీ చరిత్రాత్మకమన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల్లో గరిష్ట వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం వల్ల వందల మంది లబ్ధిపొందారన్నారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ శ్రీ రాజ్ కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ శ్రీ జనక్ ప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ నర్సింహారెడ్డి, అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ లక్ష్మీపతి గౌడ్, శ్రీ పెద్ది నర్సింహులు, అన్ని ఏరియాలకు సంబంధించిన గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.








## చిన్నారుల్లో వచ్చే లుకేమియాను
## ముందే గుర్తించవచ్చా.. లక్షణాలు ఎలా ఉంటాయి..?

పిల్లల్లో వచ్చే క్యాన్సర్లలో లుకేమియా అత్యంత సాధారణమైనదిగా చెప్పవచ్చు. అయితే భయపడాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా చిన్నారుల్లో కనిపించే అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా (ఏఎల్ఎల్)ను ప్రారంభ దశలో గుర్తించి, వైద్యుల సూచనల మేరకు చికిత్సను పూర్తిగా కొనసాగిస్తే నయం చేసే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. వ్యాధిని ఆలస్యంగా గుర్తించడం, చికిత్సను మధ్యలోనే ఆపేయడం వంటి కారణాల వల్లే ఫలితాల్లో తేడాలు కనిపిస్తున్నాయి. అందుకే తల్లిదండ్రులు లక్షణాలపై అవగాహన కలిగి ఉండటం, అనుమానం వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యం. ఇతర క్యాన్సర్లతో పోలిస్తే లుకేమియా కొంత భిన్నంగా ఉంటుంది. సాధారణంగా కొన్ని క్యాన్సర్లు శరీరంలోని ఒక ప్రాంతంలో కణితిగా ఏర్పడి క్రమంగా పెరుగుతాయి. కానీ లుకేమియా ఎముక మజ్జలో ప్రారంభమవుతుంది. ఇక్కడే శరీరానికి అవసరమైన రక్తకణాలు తయారవుతాయి. అసాధారణమైన తెల్ల రక్తకణాలు వేగంగా పెరగడంతో ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్లు, ఆరోగ్యకరమైన తెల్ల రక్తకణాల తయారీకి ఆటంకం ఏర్పడుతుంది. ఫలితంగా చిన్నారుల్లో రక్తహీనత, ఇన్ఫెక్షన్లు, రక్తస్రావం వంటి సమస్యలు కనిపిస్తాయి.

**కీమోథెరపీకి మంచి స్పందన..**

లుకేమియా వేగంగా విభజించే కణాలతో సంబంధం ఉన్న వ్యాధి కావడం వల్ల కీమోథెరపీకి మంచి స్పందన కనిపిస్తుంది. చికిత్స ప్రారంభించిన తర్వాత చాలా మంది చిన్నారుల్లో నాలుగు నుంచి ఆరు వారాల్లోనే రిమిషన్ దశకు చేరుకునే అవకాశం ఉంటుంది. అంటే పరీక్షల్లో లుకేమియా కణాలు గుర్తించలేని స్థితికి చేరుకోవడం. దేశంలో దాదాపు 2,700 మంది ఏఎల్ఎల్ చిన్నారులపై నిర్వహించిన ఒక విస్తృత అధ్యయనంలో, ప్రారంభ దశలో స్టాండర్డ్ రిస్క్‌గా గుర్తించిన పిల్లల్లో నాలుగేళ్ల మొత్తం జీవించే అవకాశాలు సుమారు 88 శాతంగా ఉన్నట్లు తేలింది. వ్యాధిని సకాలంలో గుర్తించి, సరైన చికిత్స అందించినప్పుడు మంచి ఫలితాలు సాధించవచ్చని ఇది సూచిస్తోంది. లుకేమియాను ఆలస్యంగా గుర్తిస్తే వ్యాధి ఎముక మజ్జలో మరింతగా విస్తరించడంతోపాటు రక్తప్రవాహం ద్వారా శరీరంలోని ఇతర ప్రాంతాలకు చేరే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కేంద్ర నాడీ వ్యవస్థ లేదా ఇతర అవయవాలపైనా ప్రభావం చూపిస్తుంది. దీంతో చికిత్సకు స్పందించడం కష్టమవుతుంది, తిరిగి వ్యాధి వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఆసుపత్రికి చేరుకునే సమయానికి కొంతమంది పిల్లల్లో తీవ్రమైన రక్తహీనత, ప్లేట్‌లెట్ల కొరత, ఇన్ఫెక్షన్లు వంటి సమస్యలు ఉండటంతో చికిత్స ప్రారంభించడం కూడా సవాలుగా మారుతుంది.



**ఆలస్యంగా గుర్తిస్తున్నారు..**

భారత్‌లో పిల్లల క్యాన్సర్ విషయంలో ఆలస్యంగా గుర్తించడం ఒక ముఖ్యమైన సమస్యగా ఉంది. దేశంలో ప్రతి ఏడాది 75వేల మందికి పైగా చిన్నారులకు క్యాన్సర్ వస్తున్నట్లు అంచనాలు ఉన్నాయి. అయితే వీరిలో దాదాపు సగం మందికి వ్యాధి నిర్ధారణే జరగడం లేదని ప్రజారోగ్య అంచనాలు తెలియజేస్తున్నాయి. అవగాహన లేకపోవడం, పెద్ద నగరాల వెలుపల పిల్లల క్యాన్సర్ చికిత్స అందుబాటులో లేకపోవడం, క్యాన్సర్ లక్షణాలను సాధారణ చిన్ననాటి అనారోగ్యాలుగా భావించడం ఇందుకు కారణాలుగా ఉన్నాయి. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత కూడా కొంతమంది పిల్లలు చికిత్సను పూర్తిగా కొనసాగించలేకపోతున్నారు. చికిత్స ఖర్చులు, ఎక్కువ కాలం పాటు ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం, ఇంటికి దూరంగా చికిత్స పొందడం వంటి కారణాలతో చికిత్స మధ్యలో ఆగిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**లక్షణాలేంటి..**

ఎముకలు లేదా కీళ్లలో నొప్పి, నొప్పి కారణంగా పిల్లలు సరిగ్గా నడవలేకపోవడం లేదా నడవడానికి నిరాకరించడం, మెడ, చంకలు వంటి ప్రాంతాల్లో లింఫ్ నోడ్స్ వాపు, పొట్ట అసాధారణంగా ఉబ్బినట్లు లేదా గట్టిగా అనిపించడం కూడా నిర్లక్ష్యం చేయకూడదు.

# పంత్ సరికొత్త చరిత్ర..

భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరో అరుదైన చారిత్రాత్మక రికార్డును సాధించాడు. విదేశాల్లో లేదా న్యూట్రల్ వేదికల్లో జరిగిన టెస్టుల్లో భారత వికెట్ కీపర్‌గా అత్యధిక పరుగులు సాధించిన లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న ఆల్ టైమ్ రికార్డును పంత్ బ్రేక్ చేశాడు. కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్ రెండో రోజు ఆటలో పంత్ ఈ ఘనతను నమోదు చేశాడు. ఈ విభాగంలో 2500 పరుగుల మార్కును దాటిన పంత్, ధోనీ సాధించిన 2496 పరుగుల రికార్డును అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ధోనీ 32.84 సగటుతో ఆ పరుగులు చేయగా, పంత్ దాదాపు 42 సగటుతో ఈ మైలురాయిని అందుకోవడం గమనార్హం. ఈ లిస్టులో ఫరూక్ ఇంజనీర్ (1209 రన్స్), సయ్యద్ కిర్మాణి (1109 రన్స్), కిరణ్ మోరే (901 రన్స్) తర్వాతి స్థానాల్లో నిలిచారు.. ఈ రికార్డు నమోదు కావడానికి ఒక రోజు ముందు పంత్ మైదానంలో తీవ్ర గాయానికి లోనయ్యాడు. మొదటి రోజు ఆట మూడో సెషన్‌లో శ్రీలంక పేసర్ లహిరు కుమార వేసిన షార్ట్ పిచ్ బంతిని పుల్ చేసే క్రమంలో పంత్ ఎడమ చేతి మణికట్టుకు గాయం అయింది. నొప్పితో విలవిల్లాడిన పంత్ కు భారత జట్టు ఫిజియో ఐస్ ప్యాక్ పెట్టి కట్టు కట్టినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ తీవ్ర అసౌకర్యంగా అనిపించడంతో 15 బంతుల్లో 3 పరుగులు చేసిన తర్వాత 58వ ఓవర్లో పంత్ రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగాడు. గాయం తీవ్రత భయపెట్టినప్పటికీ, రెండో రోజు ఉదయం భారత్ ఆరో వికెట్ కోల్పోయిన తర్వాత పంత్ తిరిగి బ్యాటింగ్ కు వచ్చాడు. అసిథ ఫెర్నాండో, ఇతర లంక పేసర్లు వరుసగా బౌన్సర్లతో దాడి చేస్తూ అతడి భుజానికి కూడా బంతులు తాకించినా పంత్ ఏమాత్రం లెక్క చేయలేదు. నొప్పిని భరిస్తూనే మరో వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ తో కలిసి జట్టు ఇన్నింగ్స్ ను ముందుకు నడిపించాడు. ఇద్దరూ కలిసి సమయోచిత భాగస్వామ్యంతో లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొని స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లారు. శ్రీలంక బౌలర్లు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్న సమయంలో పంత్ చూపిన అంకితభావం జట్టుకు కొండంత బలాన్ని ఇచ్చిందనడంలో సందేహం లేదు. ఇక వీళ్లిద్దరూ సాధికారికంగా



బ్యాటింగ్ చేస్తూ, అబేధ్యమైన ఏడో వికెట్ కు 112 పరుగులు జోడించారు. లంచ్ విరామ సమయానికి టీమిండియా 112 ఓవర్లలో 6 వికెట్లకు 419 పరుగులు చేసింది. పంత్ (63 బ్యాటింగ్)తో పాటు జురేల్ (59 బ్యాటింగ్) అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఫెర్నాండోకు నాలుగు వికెట్లు దక్కాయి. ఇప్పటికే గాలే టెస్ట్ లో భారత్ 165 రన్స్ తో గెలిచి సిరీస్ లో 1-0 లీడ్ లో ఉండగా, కొలంబోలోనూ పంత్ పోరాటంతో జట్టు పటిష్ట స్థితికి చేరింది.

# భారీ స్కోర్ వద్ద భారత్ డిక్లేర్డ్!

## ●ధ్రువ్ జురెల్ అజేయ శతకం

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోర్ చేసింది. ధ్రువ్ జురెల్(177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. రిషభ్ పంత్(89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. తొలి రోజు ఆటలో దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) సెంచరీతో చెలరేగగా.. శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించిన సంగతి తెలిసిందే. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/106) నాలుగు వికెట్లు తీయగా..ప్రభాత్ జయసూర్య కేశర నువాంత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. లాహిరు కుమారాకు ఒక వికెట్ దక్కింది. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా 2 బంతులు పడగానే వర్షం అంతరాయం కలిగించింది. ఆ తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. శ్రీలంక 3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 8 పరుగులు చేసింది. లాహిరు ఉడారా(1) ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా.. ప్రభాత్ జయసూర్య(2)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. వర్షం కారణంగా రెండో రోజు 56 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. 300/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓవర్‌నైట్ బ్యాటర్ సారాన్ష్ జైన్(6) రెండు పరుగులు మాత్రమే చేసి అసితా ఫెర్నాండో బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో తొలి రోజు ఆటలో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషభ్ పంత్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. తనదైన శైలిలో చెలరేగిన ఈ జోడీ వేగంగా పరుగులు రాబట్టింది. ముఖ్యంగా పంత్ భారీ షాట్లతో లంకబౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో పంత్ 81 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా.. ధ్రువ్ జురెల్ 97 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. దాంతో భారత్ 419/6 స్కోర్ వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో పంత్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అయితే అతన్ని కుశార నువాంత క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో ఏడో వికెట్‌కు నమోదైన 112



పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మానవ్ సుతార్ రాగా.. ధ్రువ్ జురెల్ తన జోరును కొనసాగించాడు. ఆచితూచిన ఆడిన మానవ్ సుతార్(18)ను ప్రబాత్ జయసూర్య కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చగా.. సిరాజ్‌తో కలిసి ధ్రువ్ జురెల్ రెండో సెషన్‌ను ముగించాడు. వర్షం కారణంగా కాస్త ముందుగానే ఈ సెషన్ ముగిసింది. ఆఖరి సెషన్‌లో దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ 171 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ వెంటనే భారీ సిక్సర్‌తో ధ్రువ్ జురెల్ తన జోరు కనబర్చగా.. సిరాజ్(3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ వేగంగా పరుగులు రాబట్టి జట్టు స్కోర్‌ను 500 ధాటించాడు. ఆ వెంటనే భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లెర్డ్ చేసింది.

# యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట!

టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట లభించింది. శ్రీలంక ప్లేయర్ అసిత ఫెర్నాండోతో గొడవ పడిన ఘటనలో ఐసీసీ జరిమానాతో సరిపెట్టింది. యశస్వి జైస్వాల్‌తో పాటు అసిత ఫెర్నాండో మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది. ఈ ఘటనలో యశస్వి జైస్వాల్‌దే తప్పంటూ మాజీ క్రికెటర్లు, కామెంటేటర్లు తీర్పు ఇచ్చారు. దాంతో యశస్వి జైస్వాల్‌పై నిషేధం పడుతుందని అంతా అనుకున్నారు. కానీ మ్యాచ్ రిఫరీ లెవెల్-1 నేరంగా పరిగణించి రూల్స్ ప్రకారం చర్యలు తీసుకున్నారు.

ఈ చర్యలకు సంబంధించి ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఆదివారం కొలంబో వేదికగా మొదలైన రెండో టెస్ట్ తొలి రోజున ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ 1 రూల్‌ను ఉల్లంఘించిన శ్రీలంక పేసర్ అసితా ఫెర్నాండో, భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ల మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నారు. ఆర్టికల్ 2.12 ప్రకారం ఒక ప్లేయర్, సపోర్ట్ స్టాఫ్, అంపైర్‌తో భౌతిక ఘర్షణకు దిగడం నేరం.మ్యాచ్ ఫీజు కోతతో పాటు చెరో డీ మెరిట్ పాయింట్ కేటాయించారు. తమ తప్పులను ఫెర్నాండో, జైస్వాల్ అంగీకరించారు. దాంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే ఈ శిక్షలు ఖరారు చేస్తున్నాం. లెవెల్ 1 ఉల్లంఘనకు పాల్పడినప్పుడు కనీస శిక్షగా హెచ్చరిక, గరిష్టంగా ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం, ఒకటి లేదా



రెండు డీమెరిట్ పాయింట్స్ ఉంటాయి.'అని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో యశస్వి జైస్వాల్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అసిత ఫెర్నాండో వేసిన ఒకే ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదాడు. ఆ తర్వాత ఫెర్నాండో ఒక అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను 45 పరుగుల వద్ద క్లీన్ బౌల్డ్ చేశాడు. వికెట్ తీసిన అనంతరం ఫెర్నాండో అత్యుత్సాహంగా సెలెబ్రేట్ చేసుకున్నాడు. ఈ క్రమంలో అతను ఏదో మాట అన్నాడు. అది విన్న జైస్వాల్ ఆగ్రహంతో అతనిపైకి దూసుకెళ్లాడు. ఒకరికొకరు ఎదురెదురుగా నిలబడి నోరుపారేసుకున్నారు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. దాంతో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండిస్ జోక్యం చేసుకొని ఇద్దర్నీ విడదీసాడు.

# సీఎస్‌కే కోచ్‌గా దినేశ్ కార్తీక్‌ను నియమించండి

## ●ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ సూచన



టీమిండియా మాజీ క్రికెటర్ దినేష్ కార్తీక్‌ను చెన్నైసూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్‌గా నియమించాలని ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ సూచించాడు. ఐదు సార్లు ఛాంపియన్ అయిన సీఎస్‌కేకు విదేశీ కోచ్‌ల కంటే స్థానిక వ్యక్తులే మెరుగైన సేవలు అందించగలరని మాథ్యూ హేడెన్ అభిప్రాయపడ్డాడు.చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్‌గా 18 ఏళ్ల పాటు సేవలందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ ఇటీవలే ఆ బాధ్యతల నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. అతను ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టగా.. సీఎస్‌కే నయా హెడ్ కోచ్ కోసం అన్వేషణ మొదలుపెట్టింది.తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన మాథ్యూ హేడెన్.. స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను తప్పించడం సాహోసోపేతమైన నిర్ణయంగా పేర్కొన్నాడు. స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడిన మాథ్యూ హేడెన్.. దినేష్ కార్తీక్‌కు హెడ్ కోచ్ పదవి బాధ్యతలు ఇవ్వాలని చెప్పాడు. 'సీఎస్‌కే వంటి పెద్ద జట్టుకు విదేశీ కోచ్ కోచ్ కంటే స్థానిక నేపథ్యం ఉన్న కోచ్ మరింత అనుకూలంగా ఉంటారు. దినేష్ కార్తీక్‌కు చెన్నై క్రికెట్ సంస్కృతి బాగా తెలుసు. కాబట్టి సీఎస్‌కే హెడ్ కోచ్ పదవికి దినేష్ కార్తీక్ సరైన వ్యక్తి. ఐపీఎల్ నుంచి రిటైర్ అయిన తర్వాత దినేశ్ కార్తీక్.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కి బ్యాటింగ్ కోచ్, కన్సల్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మార్గదర్శకత్వంలో ఆర్‌సీబీ 2025లో తమ తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకోవడమే కాకుండా ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ టైటిల్ నిలబెట్టుకుంది. సీఎస్‌కే హెడ్ కోచ్ పదవి చేపట్టేందుకు దినేష్ కార్తీక్ సరిగ్గా సరిపోతాడు.'అని మాథ్యూ హేడెన్ చెప్పుకొచ్చాడు. కొత్త కోచ్ ఎంపికపై సీఎస్‌కే ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రటకన చేయలేదు. కానీ పలువురు మాజీ ఆటగాళ్ల పేర్లు ప్రచారంలో ఉన్నాయి.ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ పేరు బలంగా వినిపిస్తోంది. ఫ్లేమింగ్ పర్యవేక్షణలో ఐదు టైటిళ్లు గెలిచిన సీఎస్‌కే.. గత మూడు సీజన్లలో దారుణంగా విఫలమైంది. కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరలేకపోయింది. దాంతోనే అతన్ని సీఎస్‌కే తప్పించింది.

# కుల్దీప్ యాదవ్‌కు నిజంగా వైరల్ ఫీవరే

## స్పష్టం చేసిన బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్

టీమిండియా రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు నిజంగా వైరల్ ఫీవరేనని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టం చేశాడు. అబద్ధం చెప్పి అతన్ని పక్కన పెట్టాల్సిన అవసరం తమకు లేదన్నాడు. శ్రీలంకతో కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌కు కుల్దీప్ యాదవ్ దూరమైన సంగతి తెలిసిందే.వైరల్ ఫీవర్‌తోనే కుల్దీప్ యాదవ్ దూరమయ్యాడని ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు బీసీసీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. 'కుల్దీప్ యాదవ్ తన వైరల్ ఫీవర్ నుంచి పూర్తిగా కోలుకోలేదు. శ్రీలంకతో రెండో టెస్ట్‌కు అతను దూరమయ్యాడు. అవసరమైతే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా కుల్దీప్ బరిలోకి దిగగలడు.'అని తెలిపింది.అయితే ఈ ప్రకటనను మెజార్టీ అభిమానులు విశ్వసించలేదు. వైరల్ ఫీవర్ పేరిట కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టు నుంచి తప్పించారని ఆరోపించారు. తొలి టెస్ట్‌లో కుల్దీప్ యాదవ్ ప్రభావం చూపలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో ఒకే ఒక్క వికెట్ తీయడంతో అతన్ని తప్పిస్తారనే ప్రచారం జోరుగా సాగింది. 33 ఏళ్ల సారాన్ష్ జైన్‌కు అవకాశం ఇస్తారనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ క్రమంలోనే వైరల్ ఫీవర్ అంటూ బీసీసీఐ చేసిన ప్రకటనపై నెటిజన్లు సందేహం వ్యక్తం చేశారు. తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న సితాన్ష్ కోటక్‌ను మీడియా ప్రతినిధులు ఈ విషయంపై ప్రశ్నించగా.. తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఇదేం ప్రశ్న ఇలా ఎలా ఆలోచిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఇది ఏ మాత్రం సందర్భోచితమైన ప్రశ్న కాదు. కుల్దీప్ యాదవ్‌కు గాలే నుంచి వచ్చేటప్పుడే వైరల్ ఫీవర్ సోకింది. జట్టుకు ఆఫ్-స్పిన్నర్ అవసరమైతే.. కుల్దీప్ యాదవ్ అనారోగ్యానికి గురయ్యాడని చెప్పాల్సిన అవసరం మాకు లేదు. అతను ఆడే స్థితిలో లేనప్పుడు ఒకవేళ ఫిట్‌గా ఉంటే ఏం చేసేవారని అడగడం సరికాదు. ఇలా ఆలోచించడం కూడా అన్యాయం'అని సితాన్ష్ కోటక్ ఘాటుగా బదులిచ్చాడు. రిషభ్ పంత్ గాయం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీరియస్ ఇంజ్యూరీ కాదని సితాన్ష్ కోటక్ తెలిపాడు. అతను తిరిగి బ్యాటింగ్ చేస్తాడని చెప్పాడు. మైదానంలో యశస్వి జైస్వాల్, అసితా ఫెర్నాండో గొడవపై స్పందిస్తూ.. ఆటలో ఇవన్నీ సహజమని అభిప్రాయపడ్డాడు. బౌలర్ ఏదో అన్నాడని, కానీ యశస్వి జైస్వాల్ అలా దూసుకెళ్తాడని తాను అనుకోలేదని చెప్పాడు. కుల్దీప్ యాదవ్ గైర్హాజరీతో 33 ఏళ్ల సరాన్ష్ జైన్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 5 వికెట్లకు 300 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) మరో శతకంతో చెలరేగగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించాడు. రవీంద్ర జడేజా(43), యశస్వి జైస్వాల్(45) తృటిలో హాఫ్ సెంచరీలు చేజార్చుకున్నారు. క్రీజులో ధ్రువ్ జురెల్(7 బ్యాటింగ్)తో పాటు సరాన్ష్ జైన్(4 బ్యాటింగ్) ఉన్నాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో మూడు వికెట్లు తీయగా.. లాహిరు కుమార, కేశర నువాంత తలో వికెట్ తీసారు.

# దేవదత్ పడిక్కల్ వరుస సెంచరీలు

శ్రీలంక పర్యటనలో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అదరగొడుతున్నాడు. ఇటీవల గాలె వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో (167, 44) రాణించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తాజాగా కొలంబో టెస్టులోనూ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, మరో సెంచరీ నమోదు చేశాడు. అదివారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పడిక్కల్ 117 పరుగులతో రాణించాడు. దీంతో ప్రస్తుతం అందరి కళ్లూ పడిక్కల్‌పై పడ్డాయి. ఛతేశ్వర్ పుజారా తర్వాత టెస్టుల్లో భారత్‌కు నెం 3 స్థానాన్ని భర్తీ చేయడం సవాల్‌గా మారింది. టెస్టుల్లో కీలకమైన ఈ వన్‌డౌన్‌లో పలువురు బ్యాటర్లను పరీక్షించి చూసింది. అయితే గతేడాది సాయి సుదర్శన్ సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయడంతో అతడే ఆ ప్లేస్‌లో బ్యాటింగ్ చేస్తున్నాడు. అప్పట్నుంచి నెం 3 స్థానానికి మేనేజ్‌మెంట్ కూడా సుదర్శన్ పేరునే పరిశీలిస్తుంది. ఈ లంక పర్యటనలో కూడా మొదట సుదర్శన్‌నే ఎంపిక చేసింది. అయితే అతడు గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆ ఛాన్స్ పడిక్కల్‌కు వచ్చింది. అలా వచ్చిన అవకాశాన్ని పడిక్కల్ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని పరుగులు సాధిస్తున్నాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 167 పరుగుల భారీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. నంబర్ 3



స్థానంలో కొంతకాలంగా ఫాస్ట్, స్పిన్ బౌలింగ్ రెండింటినీ సమర్థవంతంగా ఎదుర్కొనే టెస్టు బ్యాటర్ కోసం మేనేజ్‌మెంట్ అన్వేషిస్తోంది. అయితే ఈ సిరీస్‌లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో సెంచరీ నమోదు చేయడంతో పడిక్కల్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. సుదర్శన్ వచ్చినా జట్టులోంచి పడిక్కల్‌ను తీసివేయొద్దంటూ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. తన ప్రదర్శనతోనూ పడిక్కల్ సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. నిలకడగా రాణిస్తూ పరుగులు చేస్తుండడంతో ఈ ప్లేస్‌కు పడిక్కల్ సెట్ అయిపోయినట్లే అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత టూర్‌లో రెండు సెంచరీలు సాధించినంత మాత్రాన పడిక్కల్‌ను అప్పుడే నెం 3 బ్యాటర్ అని కన్ఫర్మ్ అయిపోడానికి వీల్లేదు. ఎందుకంటే అతడికి అసలు పరీక్ష ఇప్పుడిప్పుడే మొదలవుతుంది. ఈ నిలకడను ఇలాగే కొనసాగిస్తేనే అతడికి వన్‌డౌన్‌లో అవకాశం ఉంటుంది. అంతేకానీ ఒకట్రెండు సిరీస్‌లకు మాత్రమే ఈ ప్రదర్శన పరిమితమైతే మాత్రం కనుమరుగైపోయే ప్రమాదం ఉంది. గతంలో ఎందరో క్రికెటర్లు వచ్చిన కొత్తలో అదరగొట్టేసి, ఆ తర్వాత తుస్సుమనిపించారు. వాళ్లంతా ఇప్పుడు కనుమరుగైపోయారు.

మంగళవారం , ఆగస్టు 25 , 2026
భవిష్యత్ ప్రజాపాలన
తెలుగు దినపత్రిక



# దేవకన్యలా మెరిసిన మానస వారణాసి..





టాలీవుడ్ యంగ్ హీరోయిన్ మానస వారణాసి ఫెమినా మిస్ ఇండియా 2020 విజేత గా నిలిచారు. 'దేవకీ నందన వాసుదేవ' తో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ఇప్పుడు తన ట్రెడిషనల్ గ్రేస్‌తో కుర్రకారు గుండెలను కొల్లగొడుతోంది. హైదరాబాద్‌కే చెందిన ఈ ముద్దుగుమ్మ మిస్ వరల్డ్ 2021 పోటీల్లో టాప్-13లో నిలిచి దేశం గర్వపడేలా చేసింది. రీసెంట్‌గా రిలీజైన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో మంచి హిట్ కొట్టిన ఈ అందాల భామ, సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫొటోషూట్ ప్రస్తుతం ఫ్యాన్స్‌ని మంత్రముగ్ధులను చేస్తోంది. 'బ్రీజ్' తాకిడికి రెక్కలు విప్పుకున్న అందం: మానస వారణాసి "బ్రషెడ్ బై ది బ్రయీజ్ "అంటూ ఇన్స్టాగ్రామ్‌లో పంచుకున్న పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. లైట్‌వెయిట్, పారదర్శకమైన శారీ డ్రేప్‌లో ఆమె కనిపించిన తీరు దేవకన్యను తలపిస్తోంది. ఇక ప్లెయిన్ వైట్ స్లీవ్‌లెస్, హై-నెక్ బ్లౌజ్‌తో రూపొందించిన ఈ మోడరన్ అండ్ ట్రెడిషనల్ కాంబినేషన్ ఆమెకు ఎంతో క్లాసీ అండ్ ఫ్రెష్ లుక్‌ని ఇచ్చింది. సింపుల్ జ్యువెలరీ.. సోయగం డబుల్: ఎక్కువ హడావుడి లేకుండా మినిమల్ టచ్‌తో ఆమె చేసిన ఈ ఫొటోషూట్ అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయబద్ధమైన సిల్వర్ ఝుంకాలు, చేతికి ఒక సన్నటి బ్రాస్‌లెట్ మాత్రమే ధరించి తన సహజ సౌందర్యాన్ని ప్రదర్శించింది. ఇక కామెంట్ బాక్స్‌లో నెటిజన్లు "ఏంజెల్", "అచ్చ తెలుగు అందం", "సూపర్బ్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తూ లైకుల సునామీ సృష్టిస్తున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' హిట్‌తో ఫుల్ జోష్: మోడలింగ్‌లో రాణించిన మానస వారణాసి, నటనలోనూ తన మార్క్ చూపిస్తోంది. సంతోష్ శోభన్ సరసన ఆమె నటించిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'కపుల్ ఫ్రెండ్లీ' బాక్సాఫీస్ వద్ద మంచి హిట్ టాక్ తెచ్చుకోవడంతో ఈ భామ ఫుల్ ఖుషీగా ఉంది. ఇక అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో, యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ సినిమాతో నటిగా మానస తన స్థానాన్ని మరింత బలంగా సుస్థిరం చేసుకుంది. అందం, అభినయంతో పాటు హుందాతనంతో కూడిన సంప్రదాయ లుక్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది మానస వారణాసి. ఇక క్యూట్ అండ్ క్లాసీ ఫోజులతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ తెలంగాణ బ్యూటీ, రాబోయే రోజుల్లో తెలుగు చిత్రసీమలో మరిన్ని బిగ్ ఆఫర్లతో సంచలనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఓ ఇంటివాడైన టాలీవుడ్ నటుడు ప్రిన్స్..

## న్యూజిలాండ్ లో ఘనంగా వివాహం



టాలీవుడ్ యంగ్ హీరో ప్రిన్స్ సెసిల్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రియురాలు సాయి ప్రతిమ మెడలో మూడు ముళ్లు వేసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాడు. న్యూజిలాండ్‌లోని వనాకా ప్రాంతంలో అత్యంత సుందరమైన ప్రదేశంలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు.

వివాహ వేడుకలో వధువు సాయి ప్రతిమ ఎరుపు రంగు పట్టుచీర, సంప్రదాయ ఆభరణాలతో మహారాణిలా మెరిసిపోగా, వరుడు ప్రిన్స్ ఐవరీ కలర్ ప్రింటెడ్ పైజామాలో రాజకుమారుడిలా కనిపించాడు. వీరి పెళ్లికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో, అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ నూతన జంటకు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు.వీరిద్దరి ప్రేమకథ కూడా ఎంతో ఆసక్తికరంగా మొదలైంది. ప్రముఖ నటుడు ప్రియదర్శి ద్వారా ఒక కామన్ ఫ్రెండ్ వివాహ వేడుకలో ప్రిన్స్, సాయి ప్రతిమలకు తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం స్నేహంగా, ఆపై ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటల వరకు చేరింది.'నీకు నాకు డ్యాష్ డ్యాష్' చిత్రంతో హీరోగా పరిచయమైన ప్రిన్స్, 'బస్ స్టాప్' సినిమాతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'బిగ్ బాస్ తెలుగు' మొదటి సీజన్‌లో పాల్గొని తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. ఇటీవల 'డీజే టిల్లు', 'స్కంద' వంటి విజయవంతమైన చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ నటుడిగా తనను తాను నిరూపించుకుంటున్నాడు. ప్రస్తుతం ప్రిన్స్ మరికొన్ని ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు.

# 100 కోట్ల క్లబ్ దిశగా 'ఇరుముడి'

రవితేజ అంటే చాలు మాస్ ఆడియన్స్ ఊగిపోతారు. ఆయన సినిమాలలో యాక్షన్ ఉంటుంది .. ఎమోషన్ ఉంటుంది .. తనదైన కామెడీ ఉంటుంది. రొమాంటిక్ గా సాగిపోయే సాంగ్స్ ఉంటాయి. ఫైనల్ గా వీటన్నిటికీ మాస్ టచ్ ఉంటుంది. అయితే ఈ సారి మాత్రం ఆయన కాస్త డిఫరెంట్ గా డివోషనల్ టచ్ ఇస్తూ, 'ఇరుముడి' సినిమా చేశారు. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ నెల 21వ తేదీన భారీ ఓపెనింగ్స్ తో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. తొలి రోజునే ప్రపంచవ్యాప్తంగా 24 కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. మొదటి రోజునే హిట్ టాక్ రావడంతో, శనివారం నుంచి థియేటర్స్ పెంచవలసిన వచ్చింది. దాంతో ఈ సినిమా మరింత దూకుడు చూపిస్తూ వెళ్లింది. అలా మొదటి మూడు రోజులలో ఈ సినిమా 75 కోట్లకు పైగా గ్రాస్ ను రాబట్టింది. రెండు రోజులలోనే బ్రేక్ ఈవెన్ ను సాధించింది, రవితేజ కెరియర్లో చాలా వేగంగా ఈ స్థాయి వసూళ్లను రాబట్టిన సినిమాగా నిలిచింది. అలాగే రవితేజ కెరియర్లో యూ ఎస్ బాక్సాఫీస్ వైపు నుంచి, తొలి మిలియన్ డాలర్ మూవీగా నిలిచింది. ఇక సోమవారం రోజున కూడా ఈ సినిమా అదే జోరును కొనసాగిస్తుండటం విశేషం. 100 కోట్ల క్లబ్ లోకి ఈ సినిమా చేసే సమయం చాలా దగ్గరలోనే ఉంది. కూతురు పట్ల ఉన్న ప్రేమ .. ఆ కూతురును ఇచ్చిన అయ్యప్పస్వామి పట్ల భక్తి రవితేజ పాత్రలో ప్రధానమైన కోణాలుగా కనిపిస్తాయి. ఆడపిల్లలకు ఒక ఆశయం ఉండాలి .. వాళ్లు ధైర్యంగా పెరగాలి .. ఆదర్శంగా నిలవాలి అనే కాన్సెప్ట్ తో రూపొందిన ఈ సినిమాకి, పాటలు అదనపు బలంగా నిలిచాయి. విలేజ్ నేపథ్యంలోని హీరోయిజం .. విలేజ్ ను అడ్డాగా చేసుకుని దుర్మార్గాన్ని సాగించాలనుకున్న విలనిజం ఆవిష్కరణ ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. రవితేజ కెరియర్ లో గొప్ప హిట్ గా ఈ సినిమా నిలుస్తుందని చెప్పచ్చు.



# వివాదంతో పెద్ద ప్రచారం కొట్టేసిన వర్ధమాన నటి

సినిమా ప్రమోషన్లలో వినూత్న పద్ధతులు పాటించడం ఈ రోజుల్లో సర్వసాధారణమైపోయింది. అయితే ఇటీవల కన్నప్ప, బ్లాస్ట్ చిత్రాల ద్వారా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న వర్ధమాన నటి ప్రీతి ముకుందన్ పాల్గొన్న ఓ ప్రచార కార్యక్రమం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఓ పబ్లిక్ ఈవెంట్‌లో పాల్గొనడానికి ఆమెను గ్రాండ్‌గా రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ ఊరేగింపు సందర్భంగా అందాల భామను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు, జనం భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు మండిపడ్డారు. పబ్లిసిటీ స్టంట్ల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందంటూ పలువురు హితవు పలికారు ఇదే సమయంలో ప్రీతి ముకుందన్ కుటుంబ నేపథ్యం గురించి కూడా నెట్టింట ఒక ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు ఈ నటి మనవరాలు (గ్రాండ్ డాటర్) అంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఇందులో నిజం లేదని.. రామానుజన్ 1920లో తన 32వ ఏటనే సంతానం లేకుండా పరమపదించారని.. కాబట్టి ఆయనకు నేరుగా వారసులు ఎవరూ లేరని స్పష్టమవుతోంది. నెటిజన్లు అనుకుంటున్నట్లు రామానుజన్‌కు ప్రీతి ప్రత్యక్ష మనవరాలు కాకపోయినా ఆమె ఆయన కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం విశేషం. ప్రీతి ముకుందన్‌కు రామానుజన్ వరుసకు ముత్తాత (గ్రేట్-గ్రాండ్ అంకుల్) అవుతారు. రామానుజన్ తమ్ముడి కుమారుడే అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కర్నాటిక్ జాజ్ గిటారిస్ట్ గిటార్ ప్రసన్న (ప్రసన్న రామస్వామి) .. ఆయన సోదరి డాక్టర్ దీపా ముకుందన్. ఈ డాక్టర్ దీపా ముకుందన్ మరెవరో కాదు, హీరోయిన్ ప్రీతి ముకుందన్ తల్లే.



# నన్ను హీరోగా వద్దన్నారు..

## అయినా నా డైరెక్టర్ వినలేదు: అర్జున్ దాస్



అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా ఆగస్ట్ 28న సినిమా విడుదల

దక్షిణాదిలో వేగంగా ఎదుగుతున్న నటుడు అర్జున్ దాస్, తన కొత్త సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యాడు. అదితి శంకర్‌తో కలిసి ఆయన హీరోగా నటించిన తమిళ రొమాంటిక్ డ్రామా 'ఒన్స్ మోర్'. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడిన అర్జున్ దాస్, దర్శకుడు విఘ్నేశ్ శ్రీకాంత్ తనపై ఉంచిన నమ్మకాన్ని గుర్తుచేసుకున్నాడు. హీరోగా తనను తొలగిస్తే సినిమా నిర్మిస్తామని పలు నిర్మాణ సంస్థలు ముందుకు వచ్చినా, దర్శకుడు మాత్రం తన కోసమే నిలబడ్డారని వెల్లడించాడు. ఈ సందర్భంగా అర్జున్ దాస్ మాట్లాడుతూ, "చాలా కాలం క్రితం దర్శకుడు శ్రీకాంత్ ఈ కథతో నా దగ్గరకు వచ్చాడు. మా కామన్ ఫ్రెండ్, డైరెక్టర్ సూర్య నారాయణ్ మా ఇద్దరినీ పరిచయం చేశారు. శ్రీకాంత్ చెప్పిన లైన్ నాకు చాలా అందంగా అనిపించింది" అని తెలిపాడు. అయితే, ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఎదురైన సవాళ్లను దాస్ వివరించాడు. "ఈ కథను చాలా నిర్మాణ సంస్థలకు శ్రీకాంత్ వినిపించాడు. కానీ వాళ్లలో చాలామంది 'హీరోని మార్చితే సినిమా చేస్తాం' అని చెప్పారు. కానీ అన్ని నిర్మాణ సంస్థలకూ శ్రీకాంత్ ఒకటే చెప్పాడు.. 'లేదు, నేను ఈ సినిమా అర్జున్ దాస్‌తోనే చేస్తాను' అని అతడు గట్టిగా చెప్పినట్లు" అర్జున్ దాస్ వెల్లడించాడు. ఎంతో కాలం ఎదురుచూసిన తర్వాత, దర్శకుడి ఆలోచనలతో ఏకీభవించిన నిర్మాత యువరాజ్ గణేశన్ ముందుకు రావడంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కిందని వివరించాడు. ఈ 'ఒన్స్ మోర్' చిత్రం ఈ ఏడాది ఆగస్ట్ 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అర్జున్ దాస్, అదితి శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, మోడల్ సోనా ఓలికల్ ఒక కీలక పాత్రలో కనిపించనుంది. మలయాళంలో 'హృదయం', తెలుగులో 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సంచలనం సృష్టించిన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమకు సంగీత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

# 'శుక్రాచార్యుడి యుద్ధరావం'.. ప్రశాంత్ వర్మ 'మహాకాళి' నుంచి అక్షయ్ ఖన్నా ఫస్ట్ గ్లింప్స్

ప్రశాంత్ వర్మ క్రియేటర్‌గా, పూజ కొల్లూరు దర్శకత్వంలో నిర్మాణం బ్లాక్‌బస్టర్ చిత్రం 'హనుమాన్'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ చిత్రాన్ని అందిస్తున్నారు. 'మహాకాళి' అనే టైటిల్‌తో రానున్న ఈ చిత్రం నుంచి 'శుక్రాచార్యుడి యుద్ధరావం' పేరుతో ఫస్ట్ గ్లింప్స్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో రాక్షసుల గురువు శుక్రాచార్యుడి పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా నటిస్తున్నారు.

తాజాగా విడుదల చేసిన ఈ గ్లింప్స్, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. »THE END BEGINS» (అంతం మొదలవుతుంది) అనే ట్యాగ్‌లైన్‌తో, గంభీరమైన వాతావరణంలో అక్షయ్ ఖన్నా లుక్, డైలాగ్ డెలివరీ ఆకట్టుకుంటున్నాయి. హనుమాన్ ప్రపంచానికి కొనసాగింపుగా వస్తున్న ఈ చిత్రంలో అసుర గురువు శుక్రాచార్యుడి పాత్ర ఎంత కీలకంగా ఉండబోతోందో ఈ గ్లింప్స్ స్పష్టం చేస్తోంది. ప్రశాంత్ వర్మ మార్క్ విజువల్స్, సౌండ్ డిజైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ కథ, కాన్సెప్ట్ అందిస్తూ క్రియేటర్‌గా వ్యవహరించగా, పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భూమి శెట్టి లీడ్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నాతో పాటు శ్రియా రెడ్డి, రోహిత్ సరాఫ్, సముద్రఖని, నాజర్, మురళీ శర్మ, రజత్ కపూర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నారు.



ఈ చిత్రాన్ని 2027 జనవరి 8న సంక్రాంతి కానుకగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. 'హనుమాన్' విజయం తర్వాత పీవీసీయూ నుంచి వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

Edited,Printed,Published and Owend by CHITLA DIVYA ,Printed at POTHUGANTI RACHANA , G2, TSRINIVAS, ROAD NO : 4 , RANGAREDDY , Hyderabad- 500035 . Published at H.NO : 177/P , PLOT NO : 402 ANJAMMA RESIDENCY , MANIKONDA , Hyderabad - 500089, Telangana. Editor : CHITLA VIJAYKUMAR REDDY , RNI : TGTEL/26/A0153 e-mail : bhavishyatprajapalana@gmail.com , Cell : 81061 86888